మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..



బుధవారం WEDNESDAY 6-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 307 Issue: 307

06 మే 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:51 సూర్యాస్తమయం - సా. 6:34 తిథి చవితి ఉ. 7:51 వరకు తరువాత పంచమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం మూల మ. 3:45 వరకు తరువాత పూర్వాషాఢ యోగం సిద్ధ రా. 1:03o వరకు కరణం భాలవ ఉ. 7:51 వరకు కౌలవ రా. 9:03 వరకు వర్జ్యం మ. 2:05 నుండి మ. 3:53 వరకు దుర్ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు రాహుకాలం మ. 12:12 నుండి మ. 1:48 వరకు యమగండం ఉ. 7:26 నుండి ఉ. 9:02 వరకు గుళికాకాలం ఉ. 10:37 నుండి మ. 12:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:15 నుండి తె. 5:03 వరకు అమృత ఘడియలు ఉ. 8:46 నుండి ఉ. 10:34 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## రిజైన్ చేసే ముచ్చట్లేదు: మమత

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేయనని స్పష్టం చేశారు. తాను లోక్ భవన్‌కు వెళ్లనని.. గవర్నర్‌కు రాజీనామా ఇవ్వనని స్పష్టం చేశారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే.

కోల్‌కతా: ఈ నేపథ్యంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించిన మమతా బెనర్జీ.. బీజేపీపైనా, ఎన్నికల సంఘంపైనా సంచలన ఆరోపణలు చేశారు. బెంగాల్ ఎన్నికల్లో టీఎంసీ పార్టీ ఓడిపోలేదని. విజయం సాధించిందన్న మమతా బెనర్జీ.. తమ ఓట్లను చోరీ చేశారని ఆరోపించారు. మొత్తం వ్యవస్థపై తాము పోరాటం చేశామన్న తరువాయి 2 వ పేజీలో...




## ఎన్నికల దోపిడీ జరిగింది: రాహుల్

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాం ఎన్నికల్లో బీజేపీ అక్రమాలకు పాల్పడిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్ సహకారంతోనే బీజేపీ ఈ ఎన్నికల దొంగతనం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేసిన ఆరోపణలకు మద్దతు తెలుపుతూ రాహుల్ వ్యాఖ్యలు చేశారు.

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారతీయ జనతా పార్టీ ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని ఎన్నికలను అపహాస్యం చేసిందని ఆయన ఆరోపించారు. పశ్చిమ తరువాయి 2 వ పేజీలో...

# అదిగో మేఘం

### వచ్చే నాలుగు రోజులు జోరు వానలు
### రాష్ట్రానికి వాతావరణ శాఖ చల్లని కబురు
### పలు జిల్లాల్లో దంచికొట్టనున్న వర్షాలు





తెలంగాణలో గత కొన్ని రోజులుగా భానుడు భగ్గమంటున్నాడు. రికార్డు స్థాయి ఎండలతో జనం అల్లాడిపోతున్నారు. ఓ వైపు మాడు పగిలే ఎండలు.. మరోవైపు భరించలేని ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు ఊరటనిచ్చేలా వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని చెప్పారు.

హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు మరికొన్ని చోట్ల వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ అకాల వర్షాలు భానుడి భగభగల నుంచి ప్రజలకు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగిస్తాయని చెప్పారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నేటి (మే 5) నుంచి ఈనెల 7వ తేదీ వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, తరువాయి 2 వ పేజీలో...



## 9న బెంగాల్ సర్కారు కొలువు

### ఠాగూర్ జయంతి నాడు బీజేపీ ప్రమాణం

పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన బీజేపీ.. ప్రభుత్వ ఏర్పాటుకు ముహూర్తాన్ని ఖరారు చేసింది. నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా మే 9వ తేదీన నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వెల్లడించారు. ఠాగూర్ ఆశీస్సులతో రాష్ట్రంలో ఒక నూతన శకాన్ని ప్రారంభించాలనే ఉద్దేశంతోనే ఈ తేదీని ఎంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కోల్‌కతా: ఈరోజే ఎన్నికల ఫలితాలకు సంబంధించిన అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ అధికారులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అందజేయనున్నారు. రేపు సీఈసీ ఈ పత్రాలను గవర్నర్ ఆర్.ఎన్.రవికి సమర్పించనున్నారు. అనంతరం తరువాయి 2 వ పేజీలో...



# రేపే విజయ్ ప్రమాణం

### టీవీకే శాసనసభాపక్ష నేతగా ఎన్నిక.. ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్‌కు లేఖ
### కాంగ్రెస్ మద్దతు కోరిన టీవీకే చీఫ్.. ఎమ్మెల్యేలంతా రిసార్ట్‌కు తరలింపు

తమిళ గడ్డపై ఒక కొత్త పార్టీ అధికారాన్ని ఏర్పాటు చేసేందుకు సర్వం సిద్ధమైంది. దశాబ్దాలుగా డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల మధ్య తమిళనాడు అధికారం చేతులు మారుతుండగా.. మొట్టమొదటిసారిగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన.. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధికారాన్ని చేపట్టనుంది. ఈనెల 7వ తేదీన తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి విజయ్.. ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారు.

చెన్నై: గురువారం రోజున చెన్నై సెంట్రల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అంగరంగ వైభవంగా ఈ పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందు కోసం టీవీకే పార్టీ నేతలు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం రోజున లోక్‌భవన్‌లో తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్‌ను కలవనున్న విజయ్.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,044 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,902 |

## జైశ్రీరాం అంటే పైసలొస్తయా? పథకాలు అందుతాయా?

### మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు
### ప్రధాని పర్యటన వేళ బీజేపీ నేతలపై విమర్శలు



హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ .. మరోసారి తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేసి.. వార్తల్లో నిలిచారు. ఈనెల 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్న విషయం తెలిసిందే. అయితే ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించి.. గత కొన్ని రోజులుగా తెలంగాణ బీజేపీ నేతలు తీవ్ర హడావుడి చేస్తున్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తెలంగాణకు వస్తున్న నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలకడంతోపాటు.. హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు 10 లక్షల మందిని సమీకరించి.. సూపర్ సక్సెస్ చేయాలని వ్యూహాలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ నేతలపై మంత్రి కొండా సురేఖ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు తరువాయి 2 వ పేజీలో...



## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య పెంపు

### పత్తి ఉత్పతి పెంపు మిషన్ ఏర్పాటు
### గుజరాత్‌లో సెమీకండక్టర్ ఫెసిలిటీ
### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 34 నుంచి 38కి పెంచుతూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు ప్రాజెక్టులకు సంబంధించి నిర్ణయాలు తీసుకుంది. పత్తి ఉత్పత్తి పెంపు మిషన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 5,659 కోట్ల రూపాయలతో మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఫామ్ టు ఫైబర్ టు ఫ్యాషన్ టు ఫారిన్ అనే లక్ష్యంతో మిషన్ ఏర్పాటు చేసింది. ప్రపంచ స్థాయిలో పోటీ పడేందుకు ప్రత్యేక మిషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీం పథకానికి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఎయిర్ లైన్స్ సంస్థల కోసం 5,000 కోట్ల రూపాయల క్రెడిట్ గ్యారెంటీకి ఆమోదం తెలిపింది. ఎంఎస్ఎమ్ఈలు, నాన్ ఎంఎస్ఎమ్ఈలకు ఆర్థిక తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



గోడకు బిగించే స్క్రూలను పట్టి ఉంచే ప్లాస్టిక్ వాల్ ప్లగ్‌ను ఆర్తుర్ ఫిషర్ కనుగొన్నారు. ఆయశ్రీశీ ఇమేజ్ క్యాప్చర్‌ను సింక్రనైజ్ చేసే ఫ్లాష్ సిస్టంను కూడా అభివృద్ధి చేశారు. ఆయన ఆవిష్కరణలు రోజువారీ జీవితాన్ని మార్చేశాయి. థామస్ ఎడిసన్ కంటే ఆర్తుర్ ఫిషర్ ఎక్కువగా 1,100 కంటే పైగా పేటెంట్లను కలిగి ఉన్నారు.



# చదువుదాం.. ఏఐ

### రాష్ట్ర విద్యారంగంలో ఏఐ విప్లవం.. వినియోగంపై ఉన్నతస్థాయి కమిటీ
### సలహాలు, సూచనలు ఇవ్వండి.. రఘురాం రాజన్‌కు సీఎం రేవంత్ వినతి

హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్య సిలబస్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, దాని ఉపయోగంపైన ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని, ఈ విషయంలో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

## ముందస్తు ఫీజుల వసూలేంది?



### ప్రైవేట్ పాఠశాలలపై హెచ్చార్సీ ఫైర్
### చర్యలు తీసుకోవాలని విద్యాశాఖకు ఆదేశం

ప్రైవేట్ పాఠశాలల ముందస్తు ఫీజు వసూలు విషయంలో రాష్ట్ర మానవహక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. పాఠశాలల్లో ముందస్తు ఫీజు వసూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ఇటువంటి చర్యలు అనుచితం, ఏకపక్షమైనవే కాకుండా వాణిజ్యపరంగా విద్యను మలచరాదనే న్యాయసూత్రాలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేసింది.

హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): ఈ మేరకు మానవహక్కుల సంఘం చైర్మన్ షమీమ్ అక్తర్ అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. బోడుప్పల్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాల 2026-2027 విద్యా సంవత్సరానికి 50% ఫీజును ముందుగానే వసూలు చేయడం, అలాగే పుస్తకాలు, యూనిఫాంల కోసం ముందస్తు చెల్లింపులు కోరడం వంటి అంశాలపై మానవహక్కుల సంఘంలో ఫిర్యాదు నమోదైంది. దీనిని విచారించిన హ్యూమన్ రైట్స్ కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం - 2 వ పేజీలో...



## ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ నిలిపివేత

హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): రాష్ట్రంలోని 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి సోమవారం ప్రకటించిన అడ్మిషన్ల షెడ్యూల్‌ను తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

6.5.2026

మేషం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొత్త పనులు చేపట్టి విజయం సాధిస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. నూతన వస్తులాభాలు పొందుతారు వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్థులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృషభం: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మిథునం: నూతన ఋణయత్నాలు చేస్తారు. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది.దూరపు బంధువులను కలుసుకుంటారు. ఆర్థిక పరిస్థితి కొంత గందరగోళంగా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

కర్కాటకం: చేపట్టిన పనుల్లో తొందరపాటు మంచిది కాదు. ఇంటాబయట మానసిక ఒత్తిడులు అధికామౌతాయి. ఆర్థిక పరిస్థితి కొంత గందరగోళంగా ఉంటుంది. నూతన రుణయత్నాలు ఫలించవు. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

సింహం: అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. మొండి బాకీలు వసూలు చేసుకోగలుగుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులు అధికారుల అండదండలతో ముందుకు సాగుతారు.

కన్య: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కొన్ని వ్యవహారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక వ్యవహారాలు కొంత నిరాశ పరుస్తాయి. వ్యాపారంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకపోవడం మంచిది. వృత్తి ఉద్యోగాల్లో స్థానచలన సూచనలు ఉన్నవి.

తుల: చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు ఆశజనకంగా సాగుతాయి. ఆర్థికంగా అవసరానికి ధన సహాయం లభిస్తుంది.

వృశ్చికం: ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించదు. వృత్తి వ్యాపారాల్లో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి ఒత్తిడులు పెరుగుతుంది. బంధుమిత్రులతో ఆలయాలు సందర్శిస్తారు.

ధనస్సు: దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. వృత్తి వ్యాపారాలు లాభాల బాట పడతాయి. ఉద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది.

మకరం: ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

కుంభం: అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేయుట మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. కుటుంబసభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. వ్యాపారపరంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు ఉంటాయి.

మీనం: బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. కొన్ని వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసిరావు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు.

# అదిగో మేఘం

మొదటి పేజీ తరువాయి

నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. వీటితో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి జిల్లాల్లోనూ పిడుగలతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఆ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్ నగరవాసులకూ వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. నగరంలో 8వ తేదీ వరకు ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం 42 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి 2 డిగ్రీల నుంచి 5 డిగ్రీల మేర తగ్గి 39 డిగ్రీల కంటే తక్కువకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న వడగాల్పుల తీవ్రత నుంచి నగరవాసులకు విముక్తి లభించనుంది.

ఏపీలో పిడుగులు పడి ముగ్గురు మృతి


ఏపీలోనూ మరో మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నాయి. వచ్చే మూడు



రోజులు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మంగళవారం అంచనా వేసింది. పిడుగులు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో.. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద నిలబడొద్దని హెచ్చరించారు. మరోవైపు అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం రోజున శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ఉభయగోదావరి జిల్లాలు. శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తూర్పుగోదావరి జిల్లా గోకవరం, కాకినాడ జిల్లాలోని జగ్గంపేట, పోలవరం జిల్లాలోని చింతూరు మండలాల్లో బుధవారం రోజున వడగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఎండ తీవ్రత, ఉక్కపోతల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మంగళవారం రోజున నంద్యాల జిల్లా బనగానపల్లిలో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం విజయనగరం జిల్లా రాజాం మండలంలోని గెడ్డ వలస గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పిడుగు పడి ముగ్గురు మహిళా కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మహిళలు పొలం పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో సత్తెమ్మ, నరసమ్మ, పైల రాము అనే ముగ్గురు మహిళలు దగ్గర్లోని చెట్టుకిందకు పరుగులు తీశారు. చెట్టు కింద ఉన్న సమయంలో అకస్మాత్తుగా పిడుగు పడడంతో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరిలో సత్తెమ్మ, నరసమ్మ తోటి కోడళ్లు. దీంతో అనుకోని రీతిలో ఒకే కుటుంబంలోని ఇద్దరు ఒకే రోజు చనిపోవటం.. ఆ ఇంట్లో తీవ్ర విషాదం నింపింది.

## ముందస్తు ఫీజుల వసూలేంది?

మొదటి పేజీ తరువాయి




విద్య హక్కు ప్రాథమిక హక్కు కాగా, దానిని లాభాపేక్షతో నిర్వహించరాదని సంఘం పునరుద్ఘాటించింది. తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారం, అలాగే నిర్దిష్ట విక్రేతల వద్ద నుంచే పుస్తకాలు, యూనిఫాంల కొనుగోలు చేయాల్సిందిగా ఒత్తిడి చేయడం వల్ల పారదర్శకత లోపిస్తున్న అంశాలను గమనించిన సంఘం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి తగిన చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ నిబంధనల ప్రకారం విడతలవారీగా ఫీజులు వసూలు చేసే విధానాన్ని అమలు చేయాలని సిఫార్సు చేసింది. ప్రొటెక్షన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ చట్టం, 1993 ప్రకారం నిర్ణీత గడువులోగా తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారిని సంఘం ఆదేశిస్తూ, ఈ వ్యవహారాన్ని ముగించింది.

## జైశ్రీరాం అంటే పైసలొస్తయా?

మొదటి పేజీ తరువాయి

సభలు, సమావేశాలు పెట్టడం.. జై శ్రీరాం అనడమే పనిగా పెట్టుకున్నారని మంత్రి కొండా సురేఖ విమర్శలు గుప్పించారు. జై శ్రీరాం అంటే పై నుంచి పైసలు పడుతున్నాయా.. పథకాలు ఏమైనా వస్తున్నాయా అని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీని తెలంగాణకు తీసుకొచ్చి ఒక మీటింగ్ పెట్టించి.. హిందీలో 4 మాటలు మాట్లాడించి.. తిరిగి పంపించేస్తారని విమర్శించారు. తెలంగాణలో ఉన్న ఇద్దరు కేంద్రమంత్రులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఏమీ మాట్లాడరని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తెప్పించే ప్రయత్నం కూడా కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు చేయరని కొండా సురేఖ ఆరోపించారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా.. ఇక్కడి బీజేపీ నేతలు ఏమీ మాట్లాడకుండా నోరుమూసుకుని కూర్చుంటారని మండిపడ్డారు. హనుమకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాలో పాల్గొన్న కొండా సురేఖ.. ఈ వ్యాఖ్యలు చేశారు. గోదావరి నదీ పుష్కరాల కోసం పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను విడుదల చేసినట్లు గుర్తు చేసిన మంత్రి కొండా సురేఖ.. అదే తెలంగాణకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. అదే తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి గోదావరి పుష్కరాల కోసం రూ.4200 కోట్లను కేటాయించి అందులో ఇప్పటికే రూ.1400 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఇక తెలంగాణలోని భద్రాచలం, వేములవాడ, బాసర సహా మొత్తం 4 ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీపైనా మంత్రి కొండా సురేఖ విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ కళ్లు ఉండి చూడని.. చెవులు ఉండి వినలేని పార్టీ అని ఎద్దేవా చేశారు. రైతుల కోసం అహర్నిషలు పనిచేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌ను విమర్శించడమే గులాబీ నేతలు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 ఏళ్లలో రైతులుకు ఏం చేశారో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. అన్నదాతలకు వ్యతిరేకంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం 3 నల్లచట్టాలను తెస్తే బీఆర్ఎస్ వాటికి మద్దతు పలికినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజలకు విద్య, ఆరోగ్యం, సంక్షేమం సీఎం రేవంత్ రెడ్డి అందిస్తుంటే.. ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య పెంపు

మొదటి పేజీ తరువాయి

సహకారం కోసం పథకానికి ఆమోదముద్ర వేసింది. చెరుకు పంటకు క్వింటాలు 365 రూపాయల మద్దతు ధర పెంపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గుజరాత్‌లోని వదినారులో షిప్ రిపేర్ ఫెసిలిటీకి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దీని వల్ల 5 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రెండు నూతన సెమీ కండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 3,936 కోట్ల రూపాయలతో గుజరాత్‌లో సెమీ కండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేస్తారు. 2,230 మంది నిపుణులకు ఉపాధికి అవకాశం దక్కనుంది.

### ఇతర కీలక నిర్ణయాలు:

- రెండు కొత్త సెమీకండక్టర్ యూనిట్లకు ఆమోదం (రూ.3,068 కోట్లు, రూ.868 కోట్లు)
- 2026-27 చక్కెర సీజన్‌కు ఎఫ్ఆర్పీ రూ. 365/క్వింటాల్‌గా నిర్ణయం
- ఈసీఎల్పీఎస్-5 కింద రూ.18,100 కోట్ల ప్యాకేజీకి ఆమోదం
- గుజరాత్‌లో వడినార్‌లో నౌకల మరమ్మతు కేంద్రం - రూ.1,570 కోట్లు
- నాగ్దా-మథుర 3,4వ రైల్వే లైన్ (568 కి.మీ) - రూ.16,403 కోట్లు
- గుంటకల్ - వాడి రైల్వే లైన్ (230 కి.మీ) - రూ.4,758 కోట్లు
- బుర్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్ (103 కి.మీ) - రూ. 2,276 కోట్లు

## ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ నిలిపివేత

మొదటి పేజీ తరువాయి

తాత్కాలికంగా నిలిపివేస్తూ బోర్డు కార్యదర్శి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. బోర్డు వర్గాల సమాచారం ప్రకారం, ఇంటర్మీడియట్ విద్యా విధానంలో కొన్ని కీలక సంస్కరణలను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రతిపాదిత సంస్కరణల నేపథ్యంలో సోమవారం జారీ చేసిన అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను ప్రస్తుతం నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, కోఆపరేటివ్, గురుకుల, మోడల్ స్కూల్, కాంపోజిట్ డిగ్రీ కళాశాలలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. అడ్మిషన్లకు సంబంధించిన సవరించిన నూతన మార్గదర్శకాలను,షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని బోర్డు పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు అందరికీ సమాచారం అందించినట్లు బోర్డు తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు తదుపరి ఆదేశాల వరకు వేచి చూడాలని సూచించారు.

## రిజైన్ చేసే ముచ్చట్లేదు: మమత

మొదటి పేజీ తరువాయి

మమత.. ప్రధాని, హోం మంత్రి అందరూ ఇందులో భాగస్వామ్యులయ్యారని ఆరోపించారు. ఓటర్ల జాబితా నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారన్న మమత.. కోర్టును ఆశ్రయించిన అనంతరం 32 లక్షల పేర్లను పునరుద్ధరించారన్నారు. ఈ ఎన్నికల్లో తాము ఓడిపోలేదని.. తమ వంద సీట్లను బలవంతంగా లాక్కున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు. బెంగాల్ ప్రజల పాలిట సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కూడా విలన్‌గా మారారని మమత ఆరోపించారు. ఓటింగ్ పూర్తి అయిన తర్వాత కూడా ఈవీఎంలు 80 నుంచి 90 శాతం ఛార్జింగ్‌తో ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. ఎన్నికలకు రెండు రోజుల ముందు నుంచే తమ వారిని అరెస్ట్ చేయటం ప్రారంభించారని.. సోదాలు చేశారని విమర్శించారు. ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను మార్చారని.. ఎన్నికల సంఘంతో కలిసి బీజేపీ గేమ్ ఆడిందని ఆరోపించారు. తన జీవితంలో ఇలాంటి ఎన్నికలను ఎప్పుడూ చూడలేదన్నారు.

## ఎన్నికల దోపిడీ జరిగింది: రాహుల్

మొదటి పేజీ తరువాయి

బెంగాల్‌లో సుమారు 100 సీట్లను బీజేపీ దోచుకుందన్న మమతా బెనర్జీ వాదనతో తాను ఏకీభవిస్తున్నట్లు రాహుల్ స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా ఇలాంటి చోరీలే జరిగాయని, వ్యవస్థలను చేజిక్కించుకోవడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆయన మండిపడ్డారు.

## 9న బెంగాల్ సర్కారు కొలువు

మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీని రాజీనామా చేయాల్సిందిగా గవర్నర్ ఆహ్వానిస్తారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే వరకు మమతా బెనర్జీ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా తన విధులను కొనసాగిస్తారు. ప్రభుత్వ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైనప్పటికీ, బెంగాల్ పీఠాన్ని అధిరోహించబోయే ఆ 'కీలక నేత' ఎవరనే దానిపై బీజేపీ అధిష్ఠానం ఇంకా రహస్యాన్ని మెయింటైన్ చేస్తోంది. మరో రెండు రోజుల్లో ఈ ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది. సీఎం రేసులో సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో సీఎం మమతా బెనర్జీని నందిగ్రామ్ లో ఓడించిన సువేందు.. ఈసారి ఎన్నికల్లో ఆమెను భవానీపూర్ లోనూ చిత్తు చేశారు.

## రేపే విజయ్ ప్రమాణం

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసేందుకు తనకు ఉన్న బలాన్ని అధికారికంగా ఆయనకు వివరించనున్నారు. ప్రస్తుతం టీవీకే పార్టీకి సొంతంగా 108 స్థానాల్లో విజయం సాధించగా.. మెజార్టీ మార్కును అందుకునేందుకు మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ఆ 10 మంది బలాన్ని కూడగట్టేందుకు ఇతర పార్టీలు, నేతలతో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు.. టీవీకే పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు చేజారకుండా కూడా ఆ పార్టీ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. గెలిచిన 108 మంది ఎమ్మెల్యేల్లో విజయ్ మినహా.. మిగిలిన ఎమ్మెల్యేలను అందర్నీ రిసార్ట్‌కు తరలించింది. ఎన్నికల ఫలితాలు వెలువడకముందే.. మహాబలిపురంలోని ఒక లగ్జరీ ప్రైవేట్ రిసార్ట్‌ను బుక్ చేసి పెట్టిన టీవీకే.. తాజాగా వారిని అక్కడికి తీసుకెళ్లింది. మే 7వ తేదీన ప్రమాణ స్వీకార కార్యక్రమం వరకు ఆ ఎమ్మెల్యేలను అందర్నీ అక్కడే సీనియర్ నేతల పర్యవేక్షణలో ఉంచనున్నారు. మరోవైపు, మంగళవారం ఉదయం సమావేశమైన టీవీకే పార్టీ ఎమ్మెల్యేలు.. విజయ్‌ని టీవీకే శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు.

### విజయ్‌కు కాంగ్రెస్ మద్దతు

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ అగ్రనేతలు జైరాం రమేష్, కేసీ వేణుగోపాల్ త్వరలోనే ఒక విలేకరుల సమావేశం నిర్వహించి, విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతుపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో ఇతర పార్టీల మద్దతు అనివార్యమైంది. ఈ క్రమంలో 5 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ పార్టీ విజయ్‌కు బాసటగా నిలవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దశాబ్దాలుగా డీఎంకేతో మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు విజయ్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త మలుపు రాబోతోంది. జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కోవడానికి ప్రాంతీయ పార్టీల సహకారం అవసరమని భావిస్తున్న కాంగ్రెస్, విజయ్ వంటి యువ నేతతో జతకట్టడం ద్వారా రాష్ట్రంలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది.

# చదువుదాం.. ఏఐ

మొదటి పేజీ తరువాయి

కోరారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రఘురామ్ రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఏఐ వినియోగంతో పాటు మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. సరైన పద్ధతిలో ఏఐని వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని రాజన్ చెప్పారు. తమిళనాడు తరహాలో పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని తెలిపారు. డేటా సెంటర్స్ కోసం పెద్ద ఎత్తున విద్యుత్, నీటి వినియోగం ఉంటుందని చెప్పారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు వస్తానని ఈ సందర్భంగా తెలిపారు. నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రఘురామ్ రాజన్ వివరించారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్యను తగ్గించుకోవాలంటూ పలు సూచనలు చేశారు. ప్రభుత్వాలు అనుసరించే సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని చెప్పారు. స్టార్టప్ లను ఎక్కువ ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల కోసం కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కావాల్సిన భూమితో పాటు మౌలిక సదుపాయాలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డుతో పాటు అనేక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి పైన దృష్టి సారించినట్లు తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ విధానంలో ముందుకు వెళుతున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రా అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారన్నారు. తెలంగాణ



పారిశ్రామికాభివృద్ధి కోసం తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని రఘురామ్ రాజన్‌ని కోరారు. సులభతర వ్యాపారానికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వివరించారు. ఫార్మా , ఐటీ, డేటా సెంటర్ల కోసం కావాల్సిన మంచి వాతావరణం, వసతులు కల్పిస్తున్నట్లు రఘురామ్ రాజన్‌కి వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.

# కొండా దైవద్రోహ మంత్రి

## మంత్రి సురేఖపై బీజేపీ ఫైర్.. శ్రీరాముడిని అవమానించేలా మాట్లాడారని ఆరోపణలు

హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): బీజేపీ నేతలను విమర్శించే క్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. జై శ్రీరాం అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అగ్గి రాజేస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన, దాని కోసం బీజేపీ నేతలు చేస్తున్న ఏర్పాట్లపై తాజాగా స్పందించిన మంత్రి కొండా సురేఖ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు మీటింగ్ పెట్టి, జై శ్రీరాం అంటారని.. అలా చేస్తే డబ్బులు వస్తాయా, పథకాలు వస్తాయా అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దుమారానికి కారణం అయ్యాయి. దీనిపై కాషాయ పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో మంత్రి కొండా సురేఖపై విరుచుకుపడుతున్నారు. మంగళవారం రోజున హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాకు హాజరైన కొండా సురేఖ.. అక్కడ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కొండా సురేఖ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన తెలంగాణ బీజేపీ.. తీవ్రంగా మండిపడింది. 'దేవాదాయ శాఖ మంత్రి కాదు.. దైవద్రోహ శాఖ మంత్రి. శ్రీరాముడిపై మంత్రి కొండా సురేఖ అహంకారపూరిత వ్యాఖ్యలు' అంటూ విరుచుకుపడింది. జై శ్రీరామ్ నినాదాన్ని పైసలతో పోల్చుతూ కోట్లాది మంది హిందువుల మనోభావాలపై మంత్రి కొండా సురేఖపై విషం చిమ్మారని టీబీజేపీ ఫైర్ అయింది. హిందూ దేవుళ్లంటే కాంగ్రెస్ పార్టీకి ఉన్న చులకన భావానికి ఈ అహంకారపూరిత మాటలే సజీవ నిదర్శనమని పేర్కొంది. పవిత్రమైన దేవాదాయ శాఖకు మంత్రిగా ఉండి.. దైవాన్నే అవమానించడం దారుణమని మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ దేవుళ్లను కించపరచడమే కాంగ్రెస్ నాయకుల అసలు నైజమని ఆరోపించింది. శ్రీరాముడిని అపహాస్యం చేసిన కొండా సురేఖకు దేవాదాయ శాఖ మంత్రిగా కొనసాగే నైతిక అర్హత ఏమాత్రం లేదని తేల్చి చెప్పింది. శ్రీరాముడిని కించపరిచిన కొండా సురేఖ తక్షణమే హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇక



మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. హిందుత్వాన్ని విమర్శించడం ఇకపై అంత తేలికైన విషయం కాదని.. హిందువులు ప్రతిస్పందిస్తున్నారని పేర్కొన్నారు. ఆ ప్రతిఘటన ఇటీవలి ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ధర్మం తన మార్గాన్ని తాను వెతుక్కుంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. శబరిమల బంగారం చోరీ ఘటనలో పినరయి విజయన్.. సనాతన ధర్మ నిర్మూలన వివాదంలో ఎంకే స్టాలిన్.. గంద ధర్మం, మృత్యు కుంభ్ వ్యాఖ్యలపై మమతా బెనర్జీ.. తిరుమల వివాదంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. హిందూ బంధు అంటూ ఎగతాళి చేసిన విషయంలో కేసీఆర్ ఓటమి పాలైనట్లు బండి సంజయ్ గుర్తు చేశారు. ప్రతిసారీ విశ్వాసం అనేది రాజకీయ విమర్శలకు గురైనప్పుడు.. ఓటర్లు తమదైన రీతిలో సమాధానం ఇస్తున్నట్లు కనిపిస్తోందని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ మంత్రి జై శ్రీరామ్ నినాదాన్ని డబ్బుతో ముడిపెడితే.. ఆ తర్వాత ఏం జరుగుతుందో ఇప్పటికే ఉన్న ట్రెండ్ ద్వారా స్పష్టమవుతోందని వెల్లడించారు. ఈ సందర్భంగా.. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.. జై శ్రీరామ్ భారత మాతా కీ జై అంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు.


మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# రంగనాథ్ ఎంతకు అమ్ముడుపోయావ్?

### మూడు గంటల్లోనే ఎలా మాట మార్చావ్?

### రాఘవ కన్ స్ట్రక్షన్ క్రషర్లు కూల్చివేసినట్లు హైడ్రా ప్రకటన

### ఆ తర్వాత మూడు గంటల్లోనే మాట మార్పు: దాసోజు




హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): అక్రమ మైనింగ్ క్రషర్లకు సంబంధించి హైడ్రా కమిషనర్ రంగనాథ్ మూడు గంటల్లోనే మాటమార్చాడని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉదయం తొమ్మిది గంటలకు కొత్వాల్‌గూడలో రాఘవ కన్ స్ట్రక్షన్స్ కు చెందిన అక్రమ మైనింగ్ క్రషర్లు కూల్చివేశామని హైడ్రా ప్రకటన విడుదల చేసిందని గుర్తు చేశారు. కానీ మళ్లీ 12 గంటలకు అవి తిరుమల కంపెనీకి చెందినవని తెలిపిందని అన్నారు. ఈ మూడు గంటల్లో హైడ్రా కమిషనర్‌ను ఎవరు బెదిరించారని ప్రశ్నించారు. ఎవరికి భయపడి ప్రకటనలో మార్పు చేసి విడుదల చేశారో చెప్పాలని అన్నారు. కూల్చివేసిన క్రషర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిదని బీఆర్ఎస్ వాళ్లు ఆధారాలతో బయటపెట్టారని అన్నారు. అలాంటప్పుడు అది మంత్రిది కాదని చెప్పడానికి రంగనాథ్ ఎంతకు అమ్ముడు పోయారో చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉదయం తొమ్మిది గంటలకు కొత్వాల్‌గూడలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన అక్రమ మైనింగ్ క్రషర్లు కూల్చివేశామని హైడ్రా ప్రకటన విడుదల చేసిందని గుర్తు చేశారు. హైడ్రా అక్రమ క్రషర్లపై చర్యలు తీసుకోవడాన్ని తాము సమర్థిస్తున్నామని అన్నారు. కానీ దానిలో ఏదో కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కొందరు మంత్రులు రియల్ ఎస్టేట్ ముసుగులో దందాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల ఆస్తులు, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నట్లు తాము ఫిబ్రవరిలో బయటపెట్టామని అన్నారు. మంత్రి పదవిలో కూర్చుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిల్లర వేషాలు వేస్తున్నారని విమర్శించారు. ఆయన ఇన్నేళ్లుగా రూ.500 కోట్ల విలువైన మైనింగ్ సంపదను తరలించారని, దానిని తిరిగి ఎలా రాబడుతారో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.

# రూ. 94 లక్షలు పోగొట్టుకున్న లైన్‌మెన్

## రామగుండంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం

రామగుండం, మే 5 (ఈవార్తలు): ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో అమాయకులను బురిడీ కొట్టిస్తున్న సైబర్ ముఠాలు రోజురోజుకూ రెచ్చిపోతున్నాయి. రోజుకో తరహా మోసాలతో ఈజీగా స్కాంలు చేస్తున్నారు. తాజాగా ౧+చీూణజూలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న 48 ఏళ్ల వ్యక్తిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు.. ఏకంగా రూ. 94 లక్షలు కొల్లగొట్టారు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో భారీ లాభాలు వస్తాయన్న ఆశే సదరు బాధితుడి కొంప ముంచింది. వివరాల్లోకి వెళితే.. గత ఏడాది నవంబర్ నెలలో ఫేస్‌బుక్ బ్రౌజ్ చేస్తున్న సమయంలో అతనికి ఒక ప్రముఖ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ పేరుతో ఉన్న ప్రకటన కనిపించింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చనే ఆ ప్రకటనను నమ్మి బాధితుడు అందులోని లింక్‌ను క్లిక్ చేశారు. వెంటనే వివిధ నంబర్ల నుంచి బాధితుడికి వాట్సాప్ కాల్స్ వచ్చాయి. తాము ట్రేడింగ్ నిపుణులమని నమ్మబలికిన కేటుగాళ్లు ఒక ప్రత్యేకమైన యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. ఆ తర్వాత బాధితుడి పేరుతో ఒక ఖాతా తెరిచి మొదట తక్కువ మొత్తంతో ట్రేడింగ్ ప్రారంభించేలా చేశారు. చమురు, బంగారం స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే రోజువారీ భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. ఆ యాప్‌లో బాధితుడికి లక్షల్లో లాభాలు వస్తున్నట్లు నకిలీ గ్రాఫిక్స్ చూపించారు. ఇది నిజమని నమ్మిన లైన్‌మెన్.. తన దగ్గర ఉన్న పొదుపు మొత్తంతో పాటు అప్పులు చేసి కూడా భారీగా పెట్టుబడులు పెట్టారు. 2025 నవంబర్ 6 నుంచి 2026 మార్చి 23 మధ్య కాలంలో ఆర్‌టీజీఎస్ లావాదేవీల ద్వారా మొత్తం రూ. 94.11 లక్షలను సైబర్ కేటుగాళ్ల ఖాతాలకు బదిలీ చేశారు. పెట్టుబడి పెట్టిన డబ్బుతో పాటు వచ్చిన లాభాలను విత్ డ్రా చేసుకునేందుకు బాధితుడు ప్రయత్నించగా.. నిందితులు అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. డబ్బు విత్ డ్రా చేయాలంటే ట్యాక్సులు, కమిషన్లు, ఇతర ఛార్జీల పేరిట మరింత నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారు అడిగినవన్నీ చెల్లించినా రూపాయి కూడా వెనక్కి రాకపోవడంతో బాధితుడు తాను మోసపోయానని గ్రహించారు. మే 1న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ



బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరగాళ్లు ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలు, ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, అధిక లాభాల ఆశ చూపే యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఏవైనా అనుమానాస్పదంగా ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

# నేడు ఢిల్లీకి రేవంత్ రెడ్డి

### మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు అనుమతులపై ఫోకస్

హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై విజ్ఞప్తులు చేయనున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు, ఏఐసీసీ అగ్రనేతలతో కూడా ముఖ్యమంత్రి సమావేశం కాబోతున్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సాధించిన అఖండ విజయం ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించి, కూటమి విజయంలో తనవంతు కృషి చేశారు. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు రేసులో బలంగా వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి, వేణుగోపాల్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో, ఈ ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ సమీకరణాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

# గెలిచినప్పుడు ఓట్ చోరీ చేసినట్లేనా?

### మమత, రాహుల్ అలాగే గెలిచారా?.. టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు



హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): మమతా బెనర్జీ, రాహుల్ గాంధీలు గతంలో ఓట్ చోరీ చేసే ఎన్నికల్లో గెలిచారా? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, యావత్ ప్రపంచం ఆర్థికమాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే మోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రగతి పథంపై పరుగులు పెడుతోందని అన్నారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు. బెంగాల్‌లో 100 సీట్లలో ఓటు చోరీ జరిగిందని మమతా బెనర్జీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. వీళ్లకు ఓటు చోరీ అలవాటు కాబట్టే అప్పుడు గెలిచారని చురక అంటించారు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల తీర్పును అంగీకరించాలని, కానీ ప్రజలను అవమానపరిచే మాటలు సరికాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు సర్వశక్తిమంతమైనదని అన్నారు. ప్రజాతీర్పును మమతా బెనర్జీ అవమానిస్తుంటే కాంగ్రెస్ మద్దతు తెలపడం విడ్డూరమని మండిపడ్డారు. మూడుసార్లు మమతా బెనర్జీ గెలిచినప్పుడు తాము ఏమీ అనలేదని, ప్రజాతీర్పును గౌరవించామని అన్నారు. కానీ వాళ్లు ఓడిపోతే మాత్రం ఈవీఎంలను తప్పుబడుతున్నారని మండిపడ్డారు. ఈసీఐని, దేశాన్ని నిందించడం ఏమిటని రామచందర్ రావు ప్రశ్నించారు.

# ఎస్ఐఆర్ వల్లే మమత ఓటమి: ఒవైసీ

హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు జరగడం వల్లే ప్రతిపక్షాలు ఓటమి పాలయ్యాయని ఆయన విశ్లేషించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో సుమారు 31 లక్షల మంది ముస్లిం ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యాయని, ఇది మమతా బెనర్జీపై తీవ్ర ప్రభావం చూపిందని ఆరోపించారు. మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన భవానీపూర్ నియోజకవర్గంలో కూడా ఇదే తరహాలో ఓట్లు తొలగించారని ఆయన పేర్కొన్నారు. తమిళనాడులో కూడా ఇదే వ్యూహం అమలు జరిగిందని ఒవైసీ అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన సొంత నియోజకవర్గమైన కొళత్తూరులో ఓడిపోవడానికి ఓటర్ల గల్లంతు కూడా ఒక కారణమని ఆయన విశ్లేషించారు. కేవలం కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓటు హక్కును కాలరాయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆయన మండిపడ్డారు. ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియపై ప్రతిపక్షాలు సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయని, బీజేపీ విజయం వెనుక ఇటువంటి సాంకేతిక వ్యూహాలు ఉన్నాయని ఒవైసీ ఈ సందర్భంగా విమర్శించారు.

# మమత అహంకారానికి బుద్ధి చెప్పారు: ఈటల

హైదరాబాద్, మే 15 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం ఆయన చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గజ్వేల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించడంలో, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. చివరికి న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థాయికి పరిస్థితి దిగజారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందక వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీత్కరించుకునే స్థితికి చేరుకుందని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, తమిళనాడులో స్టాలిన్ వంటి బలమైన నేతపై ఒక సామాన్యుడు గెలిచాడంటే అక్కడి ప్రభుత్వాలపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని విశ్లేషించారు. కుటుంబ రాజకీయాలు చేస్తూ, రాష్ట్రాన్ని తమ జాగీరుగా భావించే వారికి తమిళనాడు ఫలితాలు ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో గెలవాలనుకునే వారికి ఈ ఫలితాలు కనువిప్పు కావాలని... తెలంగాణ బాగుపడాలంటే బీజేపీ అధికారంలోకి రావడమే ఏకైక మార్గమని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# రైతును రాజు చేస్తాం: పొంగులేటి

హనుమకొండ, మే 5 (ఈవార్తలు): తమది రైతు పక్షపాత ప్రభుత్వం అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హనుమకొండలో జరిగిన 'మెగా రైతు మేళా'లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి గత ప్రభుత్వం పదేళ్ల సమయం తీసుకుందని... కానీ తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నుంచి బయటపడేస్తూనే, రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేసిందని గుర్తుచేశారు. గత హయాంలో 'వరి వేస్తే ఉరి' అన్న పరిస్థితులు ఉ ఒడేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు భరోసా కల్పిస్తూ సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వంగా నిలిచిందని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎకరానికి రూ. 12 వేల ఆర్థిక సాయంతో పాటు అత్యాధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేస్తున్నామని మంత్రి తెలిపారు.

## ఈ నెల 9 నుంచి వీహెచ్ ఆమరణ నిరాహార దీక్ష

హైదరాబాద్, మే 5 (ఈవార్తలు): బీసీ కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందంటూ, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు (వీహెచ్) సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగబోతున్నట్లు ఆయన ప్రకటించారు. కేంద్రం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తన పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. మే 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో, వీహెచ్ కీలక అల్టిమేటం జారీ చేశారు. 8వ తేదీ లోపు కుల గణనపై స్పష్టత ఇచ్చిన తర్వాతే ప్రధాని రాష్ట్రంలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఓసీ అయినప్పటికీ తెలంగాణలో బీసీ కుల గణన కోసం చొరవ తీసుకున్నారని, కానీ తాను బీసీని అని చెప్పుకునే మోదీ మాత్రం బీసీలపై వివక్ష చూపుతున్నారని దుయ్యబట్టారు. మోదీ పాలనలో నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు.

# ఖమ్మంలో క్రికెట్ స్టేడియం

### భారీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా.. త్వరలోనే పట్టాలెక్కనున్న ప్రాజెక్టు

ఖమ్మం, మే 5 (ఈవార్తలు): అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయటమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తోంది. క్రీడలకు పెద్ద పీట వేస్తూ.. వారికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా.. ఖమ్మం జిల్లాలో అంతర్జాతీయ హంగులతో కూడిన భారీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో రూ.92.76 కోట్ల వ్యయంతో కూడిన సమగ్ర నివేదికను రూపొందించారు. ఖమ్మం శివార్లలోని రఘునాథపాలెం పరిధిలో నాగ్‌పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవేను ఆనుకుని ఉన్న 21.20 ఎకరాల స్థలాన్ని ఈ స్పోర్ట్స్ హబ్ కోసం గుర్తించారు. ఈ కాంప్లెక్స్‌లో ప్రధాన ఆకర్షణగా రూ.15 కోట్లతో ఫ్లడ్‌లైట్లతో కూడిన క్రికెట్ స్టేడియంను నిర్మించనున్నారు. దీనివల్ల రాత్రివేళల్లోనూ డే-నైట్ మ్యాచ్‌లు నిర్వహించుకునే వీలు కలుగుతుంది. అంతేకాకుండా క్రీడాకారుల సౌకర్యార్థం అత్యాధునిక హాస్టల్ భవనం, జిమ్, గెస్ట్ హౌస్‌లను కూడా ప్రతిపాదించారు. కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా, ఒలింపిక్ క్రీడలను ప్రోత్సహించేలా షూటింగ్ హాల్, ఆర్చరీ షెడ్, బాస్కెట్‌బాల్, వుషూ, బాక్సింగ్ హాల్స్ ఏర్పాటు చేయనున్నారు. బహుళ ప్రయోజన ఇండోర్ హాల్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించవచ్చు. స్విమ్మింగ్ పూల్, ఫుట్‌బాల్ గ్రౌండ్, ఇండోర్, ఔట్‌డోర్ క్రికెట్ ప్రాక్టీస్ నెట్స్ ఈ కాంప్లెక్స్ ప్రత్యేకతలు. పర్యావరణ హితంగా ఉండేలా ఇక్కడ సౌర విద్యుత్ ప్లాంట్‌ను కూడా ప్రతిపాదించడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం బలోపేతం అవుతుండగా.. అదే గ్రామీణ యువతకు క్రీడల్లో రాణించే అవకాశం కల్పించడమే ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లక్ష్యం. జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిట శ్రీహరితో మంత్రి తుమ్మల ఇప్పటికే చర్చలు జరిపారు. ఈ ప్రతిపాదనలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ నుంచి త్వరలో అధికారిక ఆమోదం లభించనుంది. ఈ ప్రాజెక్టు సాకారమైతే హైదరాబాద్ తర్వాత ఖమ్మం నగరం రాష్ట్రంలోనే అతిపెద్ద క్రీడా కేంద్రంగా మారుతుంది. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదికగా నిలవడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు, యువత ఉపాధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. ప్రస్తుతం ఉన్న సర్దార్ పటేల్ స్టేడియంపై రద్దీ తగ్గి, క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ లభిస్తుంది. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పీఆర్ ఈఈ మహేశ్ బాబు తెలిపారు.



## ఓడిపోయిన 24 గంటల్లోనే నియోజకవర్గానికి స్టాలిన్

కొళత్తూరు: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఘోర ఓటమి చవిచూసింది. కొళత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి డీఎంకే అధినేత స్టాలిన్ కూడా టీవీకే పార్టీకి చెందిన వీఎస్ బాబు చేతిలో 8 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. తన పార్టీ ఓడిపోవడంతో పాటు, స్వయంగా తాను ఓడిన తన నియోజకవర్గంలో స్టాలిన్ ఫలితాలు వచ్చిన 24 గంటల్లోనే పర్యటించారు. గతంలో మూడుసార్లు తనను గెలిపించిన ఆ నియోజకవర్గం ప్రజలను కలిసి మాట్లాడారు. ఈ పర్యటనకు సంబంధించి ఫొటోలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. కొళత్తూరుతో తనకు ఉన్న అనుబంధం గెలుపోటములకు అతీతమైనదని పేర్కొన్నారు. ఈ నియోజకవర్గం ప్రజలు తనకు పదిహేనేళ్ల పాటు అండగా నిలిచారని చెప్పారు. తన శక్తి మేరకు అభివృద్ధి పథకాలను విజయవంతంగా అమలు చేశానని, రాష్ట్రంలో దీనిని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో పనిచేశానని పేర్కొన్నారు. ప్రజలు లేవనెత్తిన ప్రతి సమస్యనూ నెరవేర్చేందుకు సగర్వంగా ఈరోజు తన నియోజకవర్గంలో ప్రజలను కలిసి కృతజ్ఞతలు చెబుతున్నానని తెలిపారు. ఈ నియోజకర్గంలో తాను వెళ్లిన ప్రతి వీధిలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు, పార్కులు, లైబ్రరీలు, మ్యారేజ్ హాలులు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, కాలేజీలను చూసి తన విధులను తాను నిర్వర్తించాననే సంతృప్తి కలుగుతోందని పేర్కొన్నారు. నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడైనా అండగా ఉంటానని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు.

## ఇండిగో విమానంలో మంటలు

చండీగఢ్: హైదరాబాద్ నుంచి చండీగఢ్ వెళ్లిన ఇండిగో విమానంలో పెను ప్రమాదం తప్పింది. విమానం చండీగఢ్‌లో ల్యాండ్ అయిన తర్వాత ఒక ప్రయాణికుడికి చెందిన ఎలక్ట్రానిక్ పరికరంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన క్యాబిన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ఇండిగో విమానం 6ఈ 108 హైదరాబాద్ నుంచి చండీగఢ్ చేరుకుంది. విమానం ల్యాండ్ అయి నిలిచి ఉన్న సమయంలో ఒక ప్రయాణికుడి వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరంలో మంటలు వచ్చినట్లు సిబ్బంది గుర్తించారు. క్యాబిన్ సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా, తక్షణమే విమానం నుంచి అందరినీ ఖాళీ చేయించి టెర్మినల్‌కు తరలించారు. "మే 5న ఈ ఘటన జరిగింది. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారు. అవసరమైన తనిఖీల తర్వాత విమానం తిరిగి కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. మా కస్టమర్లు, సిబ్బంది భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత" అని ఇండిగో సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, మార్చి నెలాఖరులోనూ విశాఖపట్నం నుంచి ఢిల్లీ వెళుతున్న ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించి, విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పుడు విమానంలో 161 మంది ప్రయాణికులు ఉన్నారు.

## మోదీ, రాహుల్‌కు విజయ్ థ్యాంక్స్

చెన్నై: ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి టీవీకే పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు విజయ్ థ్యాంక్స్ చెప్పారు. 'ఎక్స్' వేదికగా ఆయన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను టీవీకే పార్టీ 108 సీట్లలో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో తమ పార్టీ విజయాన్ని అభినందించిన ప్రధాని మోదీ, రాహుల్ గాంధీలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఫలితాల తర్వాత ఆయన 'ఎక్స్' వేదికగా తొలిసారి స్పందిస్తూ, ప్రజా శ్రేయస్సే తమ ఏకైక లక్ష్యమని విజయ్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రగతి, తమిళనాడు ప్రజల సంక్షేమంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ కృషిలో కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ప్రధానిని విజ్ఞప్తి చేశారు. తనకు ఫోన్ చేసి అభినందనలు తెలిపిన రాహుల్ గాంధీకి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించేందుకు సమష్టి సహకారం ద్వారా రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇస్తామని విజయ్ అన్నారు.

## విజయ్‌కు కాంగ్రెస్ మద్దతు సరిపోదు: డీఎంకే

చెన్నై: తమిళనాడులో విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ పార్టీ మాత్రమే మద్దతిస్తే సరిపోదని డీఎంకే పార్టీ నేత ఇళంగోవన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నారని, కానీ టీవీకే ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మొత్తం 118 మంది ఎమ్మెల్యేలు అవసరమని చెప్పారు. అన్నాడీఎంకే కనుక టీవీకే పార్టీకి మద్దతివ్వకుంటే, ఏ పార్టీకి సరైన మద్దతు రాక హంగ్ ఏర్పడితే మళ్లీ కొత్తగా ఎన్నికలకు వెళ్లాల్సి రావొచ్చని అన్నారు. టీవీకేకు మద్దతుపై అన్నాడీఎంకేకు బీజేపీ ఎలాంటి సూచనలు చేసిందో తమకు తెలియదని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో తమ పార్టీ డీఎంకే ఓడిపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏదో పొరపాటు జరిగిందని, అదేమిటో పరిశీలిస్తున్నామని అన్నారు. అధికారంలోకి రావడం మాత్రమే తమ పార్టీ అజెండా కాదని, కొన్ని దశాబ్దాలుగా తమ పార్టీ అధికారంలోకి ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

## విజయ్ గెలుపు.. శ్రీలంకలో సంబరాలు

**విదేశాల్లో ఉన్న తమిళుల్లో కొత్త ఉత్సాహం**

కొలంబో: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత విజయ్ సాధించిన అఖండ విజయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ విజయవార్త తెలియగానే పొరుగు దేశమైన శ్రీలంకలో, ముఖ్యంగా తమిళులు ఎక్కువగా నివసించే జాఫ్నా, ఉత్తర ప్రావిన్స్‌లో యువత పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాలుస్తూ, విజయ్ చిత్రపటాలతో ఊరేగింపులు నిర్వహిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కేవలం సినీ అభిమానులే కాకుండా, అక్కడి తమిళ సంఘాలు, పలువురు రాజకీయ నేతలు కూడా విజయ్‌ను 'జననాయగన్' అని కొనియాడుతూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతుండటంతో ఆ వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. తన రాజకీయ అరంగేట్రంలోనే దశాబ్దాల చరిత్ర కలిగిన డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి దిగ్గజ పార్టీలను ఢీకొట్టి విజయ్ సాధించిన ఈ విజయం ఒక అద్భుతంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. 100కు పైగా స్థానాలను కైవసం చేసుకుని, ఏకంగా 35 శాతానికి పైగా ఓట్ షేర్ సాధించడం ద్వారా టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించడం ఒక సంచలనం. ఈ పరిణామం కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా శ్రీలంక, మలేషియా, సింగపూర్ వంటి దేశాల్లోని తమిళ యువతను విశేషంగా ఆకర్షించింది. ఒక నటుడిగా కాకుండా, ఒక ఆశాకిరణంగా విజయ్ నాయకత్వాన్ని అక్కడి ప్రజలు స్వాగతిస్తుండటం విశేషం.

# జననాయగన్ కోసం వెయిటింగ్

**కాచుకొని కూర్చుకున్న విజయ్ ఫ్యాన్స్**



చెన్నై: "కొన్నిసార్లు రావడం లేటవ్వొచ్చేమో కానీ, రావడం మాత్రం పక్కా"... ఈ డైలాగ్ నటుడు, తమిళనాడు వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు ఇప్పుడు సరిగ్గా సరిపోతుంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి రాజకీయ నాయకుడిగా విజయ్ గెలిచారు. కానీ ఆయన అభిమానులు మాత్రం మరో విజయం, మరో కానుక కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అదే, ఆయన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదల. ఎన్నికలకు ముందు, ఈ సినిమాతో అభిమానులకు ఒక చిరస్మరణీయ బహుమతి ఇవ్వాలని విజయ్ భావించగా, వరుస అడ్డంకులు విడుదలను ఆలస్యం చేశాయి. ఇప్పుడాయనే సీఎం పీఠం ఎక్కబోతున్నారు. ఈ నేపథ్యంలో, జన నాయగన్ విడుదల లాంఛనమేనని తెలుస్తోంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌ను నిజానికి ఈ ఏడాది పొంగల్ పండుగకు విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలుగులో ఘన విజయం సాధించిన బాలకృష్ణ 'భగవంత్ కేసరి' కథ స్ఫూర్తితో తమిళ నేపథ్యానికి అనుగుణంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. అయితే, 2025 డిసెంబరులో సెన్సార్‌కు వెళ్లినప్పటి నుంచి 'జన నాయగన్'కు కష్టాలు మొదలయ్యాయి. కొన్ని మార్పులతో సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పినా, ఆ తర్వాత ఫిర్యాదులు వచ్చాయంటూ రివైజింగ్ కమిటీకి పంపింది. దీంతో చిత్రబృందం హైకోర్టును ఆశ్రయించగా, సెన్సార్ ప్రక్రియను పూర్తి చేయాలని కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పుడు విజయ్ రాజకీయ విజయం సాధించడంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఆయన ప్రభుత్వ ఏర్పాటు పనుల్లో నిమగ్నమైనప్పటికీ, 'జన నాయగన్' విడుదలను మాత్రం నిర్లక్ష్యం చేయరని తెలుస్తోంది. ముఖ్యమంత్రి అయ్యేలోపు లేదా ఆ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ సినిమాను అభిమానులకు కానుకగా ఇవ్వాలని విజయ్ యోచిస్తున్నట్లు కోలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. అయితే, సెన్సార్ పూర్తయినా విడుదల అంత సులభం కాదు. మే 14న సూర్య 'కరుప్పు' (తెలుగులో వీరభద్రుడు), మే 21న మోహన్‌లాల్ 'దృశ్యం 3', జూన్ 4న రామ్ చరణ్ 'పెద్ది' వంటి పెద్ద చిత్రాలు బరిలో ఉన్నాయి. ఈ పోటీ నడుమ పాన్ ఇండియా స్థాయిలో విడుదలయ్యే 'జన నాయగన్' వస్తే బాక్సాఫీస్ వసూళ్లు పంచుకోవాల్సి వస్తుంది. పొంగల్ విడుదల సంగతి వదిలేస్తే, ఇప్పుడు మాత్రం సినిమాకు భారీ ఓపెనింగ్స్ ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# మోదీకి ట్రంప్ అభినందనలు

**బెంగాల్‌లో విజయంపై కితాబు**



వాషింగ్టన్: పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ చరిత్రాత్మక, నిర్ణయాత్మక విజయం సాధించింది. ఈ అపూర్వ గెలుపుపై ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు తెలిపారు. ఈ విజయాన్ని వైట్‌హౌస్ "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించింది. "భారత్‌కు మోదీ వంటి నాయకుడు ఉండటం అదృష్టమని, ఆయన నాయకత్వంపై తమకు ఎంతో అభిమానం ఉందని గత నెల ఫోన్ సంభాషణలో ట్రంప్ ప్రధానితో చెప్పారని" వైట్‌హౌస్ ప్రతినిధి కుష్ దేశాయ్ తెలిపారు. ఈ విజయంతో పశ్చిమ బెంగాల్‌లో సుదీర్ఘకాలంగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ 15 ఏళ్ల పాలనకు తెరపడింది. వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం, ఈ ఫలితం ప్రధాని మోదీకి తన మూడో పర్యాయ పాలన మధ్యలో రాజకీయంగా మరింత బలాన్ని చేకూర్చింది. ఈ విజయం అనంతరం ఢిల్లీలో మద్దతుదారులను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. "బెంగాల్ భవిష్యత్తులో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ప్రజాశక్తి గెలిచింది. బీజేపీ సుపరిపాలన రాజకీయాలకు ప్రజలు పట్టం కట్టారు. పశ్చిమ బెంగాల్ ప్రజలందరికీ నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అని ఆయన అన్నారు. మోదీ ఇప్పటివరకు గెలిచిన అత్యంత కఠినమైన రాజకీయ క్షేత్రాల్లో ఇది ఒకటని బీబీసీ తన కథనంలో పేర్కొంది. ది గార్డియన్ రిపోర్ట్ ప్రకారం, ఇది బీజేపీ నాయకత్వం ఏడేళ్లుగా పన్నిన వ్యూహం ఫలితమని సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌కు చెందిన రాహుల్ వర్మ విశ్లేషించారు. "బెంగాల్‌లో బీజేపీకి బలమైన, వ్యవస్థీకృత నిర్మాణం ఉంది. హిందూ ఓట్ల ఏకీకరణ జరగకుండా ఇంతటి విజయం సాధ్యమయ్యేది కాదు" అని ఆయన వివరించారు. చాలా కాలంగా ప్రాంతీయ, వామపక్ష రాజకీయాలకు కంచుకోటగా ఉన్న బెంగాల్‌లో బీజేపీ విజయం భారత రాజకీయ చిత్రపటంలో ఒక ముఖ్యమైన మార్పు అని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

**విజయ్ ఇష్టమే మా ఇష్టం**

**ప్రభుత్వం ఏర్పాటు నిర్ణయం ఆయనదే**

**టీవీకే ఎమ్మెల్యేల స్పష్టీకరణ**

చెన్నై: ప్రభుత్వ ఏర్పాటుకు ఏ పార్టీల మద్దతు తీసుకోవాలనే నిర్ణయాన్ని తమ పార్టీ అధినేత విజయ్‌కే అప్పగించినట్లు టీవీకే పార్టీ ఎమ్మెల్యే జగన్నాథ్ మిశ్రా తెలిపారు. పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో విజయ్‌ని నాయకుడిగా ఎన్నుకున్నామని అన్నారు. గవర్నర్ చెన్నై రాగానే తమ పార్టీ శాసనసభాపక్ష నేత హోదాలో విజయ్ వెళ్ళి ఆయనను కలుస్తారని చెప్పారు. తమ పార్టీకి పూర్తి బలం లేని నేపథ్యంలో రిసార్టు రాజకీయాలు మాత్రం చేయవద్దని విజయ్ ఆదేశించారని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను టీవీకే 108 సీట్లలో గెలిచింది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మరో 10 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఈ నేపథ్యంలో రిసార్టు రాజకీయాలు వద్దని విజయ్ పార్టీ కేడర్‌కు సూచనలు చేయడం గమనార్హం. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీవీకే శాసనసభాపక్షం ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి పది సీట్లు తక్కువగా ఉన్న విషయం ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. ప్రభుత్వ ఏర్పాటు కోసం టీవీకే పార్టీ కాంగ్రెస్, అన్నాడీఎంకే పార్టీలతో చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత మెజారిటీని నిరూపించుకోవడానికి టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి పదిహేను రోజుల సమయం కోరనున్నారని తెలుస్తోంది.

## బేర్‌మన్న మార్కెట్లు

ముంబై: పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 251.61 పాయింట్లు నష్టపోయి 77,017.79 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 86.50 పాయింట్లు తగ్గి 24,032.80 వద్ద ముగిసింది. సోమవారం నాటి లాభాలను సూచీలు పూర్తిగా కోల్పోయాయి. ట్రేడింగ్ సెషన్‌లో బ్యాంకింగ్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. ప్రపంచ వృద్ధిపై ఆందోళనలు, ఇంధన మార్కెట్లలో అనిశ్చితి దీనికి కారణంగా నిలిచాయి. అయితే, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు కొంత మేర నిలదొక్కుకుని మార్కెట్లకు స్వల్ప మద్దతునిచ్చాయి. బ్రాడర్ మార్కెట్లలో మాత్రం మిశ్రమ ధోరణి కనిపించింది.

# పాక్‌కు ఆర్థిక నొప్పులు

**యుద్ధం దెబ్బకు భారీ మూల్యం**

ఇస్లామాబాద్: అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు పొరుగు దేశమైన పాకిస్థాన్‌ను ఆర్థికంగా కుదిపేస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ద్రవ్యోల్బణం, క్షీణిస్తున్న విదేశీ మారక నిల్వలు, పడిపోతున్న కరెన్సీ విలువతో సతమతమవుతున్న పాక్ ఆర్థిక వ్యవస్థకు ఈ చమురు ధరల షాక్ పెను భారంగా మారింది. ఇది కేవలం తాత్కాలిక సమస్య కాదని, పాక్ ఆర్థిక వ్యవస్థకు తగిలిన నిర్మాణాత్మక దెబ్బ అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇండియా నేరేటివ్ తన కథనంలో విశ్లేషించిన ప్రకారం, అమెరికా-ఇరాన్ యుద్ధ వాతావరణం కారణంగా ఈ ప్రాంతంలో అత్యంత నష్టపోతున్న దేశం పాకిస్థాన్. హర్మూజ్ జలసంధి మూసివేతతో అంతర్జాతీయంగా బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 112 డాలర్లకు పైగా చేరింది. దీంతో రవాణా, బీమా ప్రీమియంలు రికార్డు స్థాయికి పెరిగాయి. ఫలితంగా పాకిస్థాన్ వీక్లీ పెట్రోలియం దిగుమతి బిల్లు 300 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 800 మిలియన్ డాలర్లకు పెరిగింది. అంటే, 167 శాతం పెరుగుదల నమోదైంది. ఈ విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ధృవీకరించారు. ఈ లెక్కన పాకిస్థాన్‌పై ఏటా అదనంగా 26 బిలియన్ డాలర్ల భారం పడుతోంది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో పాకిస్థాన్ మొత్తం ఎగుమతుల ద్వారా సంపాదించిన 29.8 బిలియన్ డాలర్లతో దాదాపు సమానం. అంటే, దేశం మొత్తం ఎగుమతుల ద్వారా సంపాదించిన ఆదాయాన్ని కేవలం ఒక్క చమురు దిగుమతులకే చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులనే కదిలించే అంశమని సదరు కథనం పేర్కొంది. పాకిస్థాన్ తన పెట్రోలియం అవసరాల్లో 85 నుంచి 90 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతుంది. ప్రధానంగా గల్ఫ్ దేశాల నుంచి హర్మూజ్ జలసంధి మార్గం ద్వారానే ఈ దిగుమతులు జరుగుతాయి. పాక్‌కు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు లేకపోవడం, వ్యూహాత్మక చమురు నిల్వలు లేకపోవడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పుడు, ఆ ప్రభావం పాకిస్థాన్‌లో నేరుగా ఇంధన ధరలు, రవాణా ఛార్జీలు, విద్యుత్ టారిఫ్‌లు, నిత్యావసర వస్తువుల ధరలపై పడుతుంది. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం, చమురు ధరలు 10 శాతం పెరిగితే పాక్‌లో ద్రవ్యోల్బణం 0.4 నుంచి 0.6 శాతం పెరుగుతుంది. ఇది దక్షిణాసియాలోనే అత్యధికం కావడం గమనార్హం.

# పనిమనిషికి ఎమ్మెల్యే యోగం.. ఎవరీ కలితా మాఝీ?

**పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం**

**ఆస్‌గ్రామ్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఇంటి పనిమనిషి కలితా మాఝీ**

**ఒకప్పుడు నెలకు రూ.2,500 సంపాదించిన కలితా**

**తృణమూల్ అభ్యర్థిపై 12,535 ఓట్ల తేడాతో విజయం**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించింది. మొత్తం 294 స్థానాలకు గానూ 207 సీట్లు గెలుచుకుని భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ చారిత్రక గెలుపులో ఎందరో కొత్త ముఖాలు వెలుగులోకి రాగా, అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న పేరు కలితా మాఝీ. ఒకప్పుడు ఇళ్లలో పనిచేస్తూ నెలకు కేవలం రూ.2,500 సంపాదించిన ఆమె, ఇప్పుడు ఆస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యురాలిగా ఎన్నికై అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆమె విజయం ఖరారైన వెంటనే గతంలో ఆమె ఇంటి పనులు చేస్తున్నప్పటి పాత ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. బీజేపీ ఎంపీ పీసీ మోహన్ కూడా ఈ ఫొటోను షేర్ చేస్తూ ఆమె ప్రస్థానాన్ని కొనియాడారు. "నాలుగు ఇళ్లలో పనిచేస్తూ నెలకు రూ.2,500 సంపాదించే బీజేపీ అభ్యర్థి కలితా మాఝీ, ఆస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి గెలిచారు. ఇదే బీజేపీ శక్తి. ఇక్కడ అత్యంత సామాన్య పౌరులు కూడా ఉన్నత స్థాయికి ఎదిగి స్ఫూర్తిదాయకమైన చరిత్ర లిఖించగలరు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు కలితా మాఝీ తన కుటుంబాన్ని పోషించుకోవడానికి ఇళ్లలో పాత్రలు కడుగుతూ, ఇతర పనులు చేశారు. 38 ఏళ్ల కలితా బర్ధమాన్ జిల్లాలోని ఆస్‌గ్రామ్ నివాసి. ఆమె భర్త సుబ్రతా మాఝీ రోజువారీ కూలీ. బీజేపీ టికెట్‌పై పోటీ చేసిన ఆమె, క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లకు చేరువయ్యారు. ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి శ్యామ ప్రసన్న లహోరిపై 12,535 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కలితాకు లక్షకు పైగా ఓట్లు రావడం విశేషం. గత దశాబ్ద కాలంగా ఆమె రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. బూత్ స్థాయి కార్యకర్తగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ ఆమెను బరిలోకి దింపింది. ఆ ఎన్నికల్లో ఆమె దాదాపు 41 శాతం ఓట్లు సాధించినప్పటికీ, సుమారు 12,000 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ పట్టు వదలకుండా పనిచేసి ఈసారి గెలుపును అందుకున్నారు. ఆమె సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ ప్రకారం కలితా మాఝీపై తీవ్రమైనవి కాని రెండు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆమె మొత్తం ఆస్తుల విలువ రూ.1,61,216. ఇందులో బ్యాంకు డిపాజిట్లు, చేతిలో ఉన్న నగదు, ఎల్ఐసీ పాలసీలు ఉన్నాయి. ఆమె భర్త పేరు మీద 871 చదరపు అడుగుల నివాస స్థలం ఉంది. దీనిని ఆయన తండ్రి బహుమతిగా ఇవ్వగా, దాని ప్రస్తుత విలువ సుమారు రూ.3 లక్షలు. ఒక సామాన్య గృహ కార్మికురాలు పట్టుదలతో పనిచేసి శాసనసభకు ఎన్నిక కావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని పలువురు ప్రశంసిస్తున్నారు.

# భార్యను చంపడం ఎలా?



**యూట్యూబ్ చూసి హత్య**

**భార్య లావుగా ఉందని పాలకోవాలో విషం**

**ఏపీలోని ప్రొద్దుటూరులో దారుణం**

ప్రొద్దుటూరు, మే 5 (ఈవార్తలు): కడప జిల్లా ప్రొద్దుటూరులో సంచలనం రేపిన వివాహిత పద్మజ హత్య కేసు మిస్టరీ వీడింది. భర్త కిరణ్ కుమార్.. పద్మజను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుణ్ని అరెస్ట్ చేసిన పోలీసులు మీడియా ఎదుట హాజరుపరిచారు. విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన కిరణ్ కుమార్, ముద్దనూరుకు చెందిన పద్మజకు ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. ఈ దంపతులకు ఏడేళ్ల పాప కూడా ఉంది. అయితే కొన్నేళ్లు సజావుగా సాగిన వీరి కాపురంలో గత కొంతకాలంగా విభేదాలు తలెత్తాయి. భార్య భర్తల మధ్యన మనస్పర్థలు తలెత్తాయి. దీనికి తోడు తన భార్య లావుగా ఉందని.. ఎక్కువగా తింటోందని కిరణ్ కుమార్ భావిస్తూ వచ్చాడు. ఎలాగైనా ఆమె అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. భార్యను హత్య చేయాలని నిర్ణయించుకున్న కిరణ్.. అందుకు పక్కా స్కెచ్ వేసుకున్నాడు. ముందుగా విషం పెట్టి భార్యను హత్య చేయటం ఎలా అనే దానిపై యూట్యూబ్‌లో శోధించాడు. ఆ తర్వాత ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసి హైదరాబాద్ నుంచి విషం తెప్పించుకున్నాడు. ఈ విషాన్ని పాలకోవాలో కలిపిన కిరణ్ కుమార్.. భార్య పద్మజకు తినిపించాడు. భార్య అపస్మారక స్థితిలోకి చేరుకున్న తర్వాత.. ఇంకా చనిపోలేదని, దిండుతో అదిమి హత్య చేసినట్లు ప్రొద్దుటూరు పోలీసులు తెలిపారు. మరోవైపు ఈ కేసులో నిందితుడైన కిరణ్‌కు వివాహేతర సంబంధం కూడా ఉందని ప్రొద్దుటూరు పోలీసులు తెలిపారు. ఏడాది కిందట హైదరాబాద్‌లో ఉన్న సమయంలో వేరే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడిందని.. అయితే పద్మజ హత్యకు, ఆ మహిళకు సంబంధం ఉన్నట్లు ఇప్పటి వరకూ దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు వెల్లడించారు. భార్యభర్తల మధ్య విభేదాలు రావటంతో గత కొంతకాలంగా పద్మజ తల్లివద్ద ఉంటోంది. అయితే భార్యను చంపాలని నిర్ణయించుకున్న కిరణ్.. ఆమెను పుట్టింటి నుంచి తన ఇంటికి తెచ్చాడు. ప్రేమగా నచ్చజెప్పి ఆమెను ఒప్పించి ఇంటికి తెచ్చిన కిరణ్.. మూడు రోజులు ఆమెతో బాగానే ఉన్నాడు. ఏప్రిల్ 29వ తేదీ హైదరాబాద్ నుంచి కొరియర్ ద్వారా తెచ్చిన విషాన్ని పాలకోవాలో కలిపి.. ఆమెకు తినిపించి హత్య చేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు పద్మ తల్లిదండ్రులకు ఆమె చనిపోయిందని సమాచారం అందించాడు. అయితే కిరణ్ మీద అనుమానంతో పద్మజ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి పద్మజ పోస్టుమార్టం నివేదికలో కొన్ని అనుమానాలు వ్యక్తం కావటంతో.. పోలీసులు కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో కిరణ్ నేరం చేసినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



# రైతులకు అండగా ప్రభుత్వం

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల, మే 5 (ఈవార్తలు): వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో యాసంగి (రబీ) 2025-26 కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తలెత్తే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, రైతులను మిల్లులకు పంపకుండా అధికారులు సమన్వయంతో పరిష్కారం చూపాలని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం రాబడుతున్నందున రైస్ మిల్లర్లు, సొసైటీలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పని చేసి సకాలంలో కొనుగోళ్లు పూర్తి చేయాలని అన్నారు. హమాలీల కొరత, రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో కొనుగోళ్లు సజావుగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో వందలాది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఇతర శాఖల అధికారులు, రైస్ మిల్లుల యజమానులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

# 12 గంటలపాటు ఏసీబీ తనిఖీలు

**జగిత్యాల డీడబ్ల్యూఓ కార్యాలయంలో సోదాలు**

జగిత్యాల, మే 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మహిళా, శిశు సంక్షేమ (డీడబ్ల్యూఓ) కార్యాలయంలో ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉదయం సుమారు 11 గంటలకు కలెక్టరేట్‌లోని కార్యాలయానికి చేరుకున్న అధికారులు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలు సుమారు 12 గంటలపాటు కొనసాగినట్లు సమాచారం. గతంలో శాఖలో పనిచేసిన ఒక అధికారిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సంబంధిత ఫైళ్లను ప్రత్యేకంగా వెరిఫై చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో కార్యాలయంలోని ముఖ్య రిజిస్టర్లు, పత్రాలను పరిశీలించారు. ఉద్యోగులకు సంబంధించిన ఫోన్‌పే, గూగుల్‌పే లావాదేవీలను కూడా అధికారులు పరిశీలించగా, శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల పంపిణీ వివరాలను సేకరించారు. ఇప్పటికే సంక్షేమ శాఖపై ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈ తనిఖీలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. పూర్తి వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

# అంజన్న పెద్ద జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు

**భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలి: కలెక్టర్**

జగిత్యాల, మే 5 (ఈవార్తలు): కొండగట్టు అంజన్న పెద్ద జయంతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగే ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, షెడ్లు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా కల్పించాలని సూచించారు. భక్తుల భద్రత కోసం సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, అలాగే అకాల వేడిని దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 108 అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం: సంజయ్

జగిత్యాల, మే 5 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 'రైతు వారం' కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారిస్తే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు అవసరమైన సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జిల్లా అధికారి లత, ప్రజాపాలన స్పెషల్ ఆఫీసర్ రమేష్, ఎంపీడీవో విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి, లోహియా కంపెనీ జనరల్ మేనేజర్ మురళీధర్, స్థానిక నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో అక్రమ ఇసుక డంపులపై రెవెన్యూ దాడులు

**గోదావరి తీరంలో 3 వేల ట్రిప్పుల ఇసుక సీజ్**

ధర్మపురి, మే 5 (ఈవార్తలు): ధర్మపురి మున్సిపల్ పరిధిలో గోదావరి తీర ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులపై రెవెన్యూ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. తహశీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో సుమారు 3 వేల ట్రిప్పుల ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టిన ఈ చర్యలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ఇసుకను అనుమతి లేకుండా నిల్వ చేయడం, అక్రమ రవాణా జరపడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గోదావరి తీర ప్రాంతంలో కొంతకాలంగా అక్రమ ఇసుక దందా కొనసాగుతోందని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. తనిఖీల సందర్భంగా డంపుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి, అనుమతి లేని నిల్వలను వెంటనే స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ఇసుకను సంబంధిత అధికారులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇకపై కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలను సహించబోమని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అక్రమ ఇసుక రవాణా లేదా నిల్వ గురించి సమాచారం అందించాలని అధికారులు కోరారు.





# బీడీ టేకేదార్ల కమీషన్ రూ.6 పెంపు

కామారెడ్డి, మే 5 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర బీడీ టేకేదారులకు రూ.6 కమీషన్ పెంచుతూ మేనేజ్‌మెంట్ సంఘాలు నిర్ణయం తీసుకున్నాయి. మంగళవారం కామారెడ్డిలోని హోటల్ పర్నిక ప్యాలెస్‌లో బీడీ టేకేదారులతో జరిగిన చర్చల్లో భాగంగా కమీషన్ పెంచుతూ నిర్ణయం వెలువడింది. ఈ మేరకు బీడీ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, కమీషన్ ఏజెంట్ల ప్రతినిధుల మధ్య ఒప్పందం కుదిరింది. తెలంగాణ బీడీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హితేంద్ర ఉపాధ్యాయ్ ఆధ్వర్యంలోని యాజమాన్య బృందం, తెలంగాణ బీడీ కమీషన్ యూనియన్లు, అసోసియేషన్లతో చర్చలు జరిపి.. వచ్చే రెండేళ్ల కాలానికి గానూ ఈ కమీషన్‌ను ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ తీగల వెంకన్న, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు క్యాస మల్లారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ దివాకర్ రెడ్డి, కోశాధికారి బొమ్మకంటి గంగాధర్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల బీడీ టేకేదారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లు లేక రైతుల ఆగ్రహం

**రైతులను రోడ్డెక్కించిన ప్రభుత్వానిదే బాధ్యత.. ప్రభుత్వంపై జీవన్ రెడ్డి తీవ్ర విమర్శలు**

జగిత్యాల, మే 5 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో ప్రజా వంచన పాలన కొనసాగుతోందని, ధాన్యం కొనుగోళ్లు వెంటనే వేగవంతం చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు మద్దతు ధర అందకపోవడమే కాకుండా, కనీసం ధాన్యం కొనుగోళ్లు కూడా జరగకపోవడంతో వారు ఆందోళనలకు దిగుతున్నారని తెలిపారు. పూడూరులో రైతుల ధర్నా తర్వాతే అధికారుల్లో చలనం వచ్చిందని వ్యాఖ్యానించారు. గతేడాది జగిత్యాల జిల్లాలో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 20 వేల క్వింటాళ్లే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో 7 లక్షల టన్నుల లక్ష్యం పెట్టుకుని 4 లక్షల టన్నులే కొనుగోలు చేశారని, వరి, మొక్కజొన్న కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికే లేదని విమర్శించారు. రైతులు రోడ్లపైకి రావడానికి ప్రభుత్వం కారణమా కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఎలాంటి పరిమితులు లేకుండా కొనుగోళ్లు చేపట్టిందని గుర్తుచేశారు. రెండు వారాలుగా మొక్కజొన్న నిల్వలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయని, తేమ శాతం తగ్గిపోవడంతో రైతులకు నష్టం జరుగుతోందని తెలిపారు. తూకం వేసిన తర్వాత 24 గంటల్లో ధాన్యం ఎత్తివేయాలని, లేకపోతే క్వింటాల్‌కు రూ.200 వరకు రైతులు నష్టపోతున్నారని అన్నారు. ప్రజల సమస్యలపై



ప్రశ్నించే గొంతుకగా బిఆర్ఎస్‌లో చేరానని, ప్రజల పక్షాన ఎప్పటికీ పోరాడుతానని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. కొడిమ్యాల మండలంలో 20 కొనుగోలు కేంద్రాలు ఉండగా, కేవలం నాలుగు మాత్రమే ప్రారంభించారని విమర్శించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, హరిచరణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సారంగపూర్‌లో పర్యటన

సారంగపూర్ మండలం కేంద్రంతో పాటు బట్టపల్లి, పోతారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను జీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. పరిశీలన అనంతరం జీవన్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. నెల రోజులుగా వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అలాగే ఉండిపోతుందని, ఇప్పటివరకు తూకం ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్ల కొనుగోళ్లపై ప్రభుత్వానికి ముందుచూపు లేదని విమర్శించిన ఆయన, తూకం వేసే సమయానికి తేమ శాతం (మాయిశ్చర్) 16గా ఉన్నా, ఆన్లోడ్ చేసే సమయానికి అది 12 లేదా 10కు తగ్గిపోతుందని చెప్పారు. దీంతో ధాన్యం బరువు తగ్గి రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నష్టాన్ని రైతులపై మోపకుండా ప్రభుత్వం భరించాలని, కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన సమయంలో ఉన్న బరువుతోనే రైతులకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

# రేవంత్ ప్రచారం వల్లే కేరళంలో కాంగ్రెస్ జోరు

**అడువాల జ్యోతి లక్ష్మణ్ వెల్లడి**

జగిత్యాల,మే 5 (ఈవార్తలు):కేరళలో యూడీఎఫ్ కూటమి సాధించిన ఘన విజయం ప్రజా తీర్పుకు స్పష్టమైన నిదర్శనమని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రచారానికి లభించిన అపార ఆదరణ ఈ ఫలితాల్లో ప్రతిఫలించిందని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, నాయకత్వంపై ప్రజలు మరోసారి నమ్మకం వ్యక్తం చేశారని, రాష్ట్ర ప్రజలు పార్టీపై ఉంచిన విశ్వాసం ఈ ఫలితాల ద్వారా స్పష్టమైందన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలను అర్థం చేసుకుని ముందుకు వెళ్లిన కాంగ్రెస్ విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. ఈ విజయాన్ని చారిత్రాత్మక మలుపుగా అభివర్ణించిన ఆమె, యూడీఎఫ్ కూటమి నాయకత్వం సమన్వయం, కృషితో ఈ ఫలితం సాధ్యమైందని కొనియాడారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనానికి ఇది కీలక సంకేతంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. అలాగే, ఈ గెలుపు తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, రాబోయే ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.





# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరగాలి

జగిత్యాల, మే 5 (ఈవార్తలు): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత సూచించారు. మంగళవారం మెట్‌పల్లి మండలంలోని జగ్గసాగర్, బండలింగాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో రైతులతో మాట్లాడిన ఆమె, అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు త్వరితగతిన చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం తరలింపులో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. మ్యాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, హమాలీల కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రైతులు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ నీతా, ఆర్ఐ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజయ్ రూ.2.27 కోట్ల ఆర్థిక సహాయం

జగిత్యాల: మే 5 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లబ్ధిదారులకు వివిధ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.17 లక్షల 4 వేల 500 విలువైన చెక్కులను పట్టణానికి చెందిన 55 మందికి అందజేశారు. అలాగే కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ పథకాల కింద 180 మంది ఆడబిడ్డలకు రూ.2 కోట్ల 10 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్య ప్రణవ్, ఎమ్మార్వో రామ్మోహన్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, అడువాల జ్యోతి లక్ష్మణ్, నాయకులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పట్టణ నాయకులు, మున్సిపల్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్

విశాఖపట్నం, మే 5 (ఈవార్తలు): ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, చిరకాల వాంఛ అయిన విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ తీర రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని కీలక హామీ నెరవేరినట్లయింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అకుంఠిత దీక్ష, పట్టుదల వల్లే ఇది సాధ్యమైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వేర్వేరుగా పేర్కొన్నారు. జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా ఈ జోన్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు స్పందిస్తూ, ఉత్తరాంధ్ర ఆశయాలు, పోరాటాలకు న్యాయం జరిగిందన్నారు. విభజన చట్టంలోని హామీని నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని, 2014-19 మధ్య టీడీపీ ఎంపీలు పార్లమెంటులోనూ, బయట చేసిన పోరాటాల ఫలితమే ఈ రోజని గుర్తుచేశారు. 2019లో జోన్ ప్రకటించినప్పటికీ, 2019-24 మధ్య గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, భూసేకరణ వంటి కీలక పనుల్లో అలసత్వం ప్రదర్శించడం వల్లే ప్రాజెక్టు నిలిచిపోయిందని ఆయన విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖతో చర్చలు జరిపి ప్రక్రియను వేగవంతం చేశారని పల్లా వివరించారు.



# ధర్మపురిలో ప్లాన్ కరీంనగర్‌లో దోపిడీ

**లాడ్జిలో స్కెచ్.. గోదావరి తీరంలో కీలక ఆధారాలు**

జగిత్యాల, మే 5 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన కరీంనగర్ పీఎంజే జ్యువెల్లరీ దోపిడికి ధర్మపురి పట్టణం కేంద్రంగా కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. దుండగులు ముందస్తుగా పక్కా ప్లాన్‌తో వ్యవహరించినట్లు స్పష్టమవుతోంది. దర్యాప్తులో భాగంగా కరీంనగర్ రూరల్ డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐలు, ప్రత్యేక బృందాలు ధర్మపురి పట్టణంలోని సీసీ కెమెరాలను జల్లెడ పట్టాయి. ఈ క్రమంలో దోపిడికి ముందు ఆరుగురు అనుమానితులు పట్టణంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో బస చేసి, అక్కడే దోపిడీకి సంబంధించిన పూర్తి స్కెచ్ సిద్ధం చేసినట్లు గుర్తించారు. ప్లాన్ ప్రకారం కరీంనగర్‌లో దోపిడీ జరిపిన అనంతరం దుండగులు మళ్లీ ధర్మపురికి చేరుకుని తలదాచుకున్నట్లు సమాచారం. అయితే వారిలో ఇద్దరు గోదావరి ఒడ్డున దోపిడీకి ఉపయోగించిన పల్సర్ బైక్, హెల్మెట్‌ను వదిలేసి పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళవారం పోలీసులు డాగ్ స్క్వాడ్స్, క్లూస్ టీంలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కీలక ఆధారాలు సేకరించారు. గత 24 గంటలుగా ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేయగా, అనుమానితుల కదలికలపై నిఘా కట్టుదిట్టం చేశారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు దుండగులను పట్టుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. త్వరలోనే కీలక పురోగతి సాధించే అవకాశం ఉందని సమాచారం.

# ఆకివీడు రామాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

అమరావతి, మే 5 (ఈవార్తలు): ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయ నిర్మాణంపై దాఖలైన అభ్యంతరాలను హైకోర్టు తోసిపుచ్చింది. ఆలయ నిర్మాణానికి అధికారులు ఇచ్చిన అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం... ఆలయానికి సంబంధించిన చారిత్రక ఆధారాలను సమర్థించింది. గత 80 ఏళ్లుగా అక్కడ రామాలయం ఉన్నట్లు రికార్డులు స్పష్టంగా చెబుతున్నాయని న్యాయస్థానం పేర్కొంది. అధికారులు అన్ని రకాల ఆధారాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో అధికారుల నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో ఆకివీడు రామాలయ నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్లయింది.

# పోలీసుల కస్టడీలోకి అనంతబాబు

రాజమండ్రి, మే 5 (ఈవార్తలు): డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ నేత, ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు ఈరోజు తమ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి ఆయనను భారీ భద్రత నడుమ కాకినాడకు తరలించారు. ఈ ప్రయాణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతబాబును ఒక్కరోజు కస్టడీలోకి తీసుకునేందుకు కోర్టు అనుమతించిన సంగతి తెలిసిందే. కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌లో అనంతబాబును ప్రత్యేక బృందం విచారిస్తోంది. ముఖ్యంగా హత్య జరిగిన రాత్రి అసలేం జరిగింది? సుబ్రహ్మణ్యాన్ని ఇంటి నుంచి ఎందుకు తీసుకెళ్లారు? హత్యకు దారితీసిన అసలు కారణాలు ఏంటి? అనే కీలక అంశాలపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

లవ్లీ చిత్రం



# ఆర్‌బీ చౌదరి దుర్మరణం



ప్రముఖ సినీ నిర్మాత, 'సూపర్ గుడ్ ఫిల్మ్స్' అధినేత ఆర్.బి. చౌదరి రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. తెలుగు, తమిళం, మలయాళం మరియు హిందీ భాషల్లో దాదాపు 90కి పైగా చిత్రాలను నిర్మించిన ఆయన, కుటుంబ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ఆయన మరణవార్త విన్న సినీ ప్రముఖులు, అభిమానులు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు. భారతీయ సినిమా ఒక గొప్ప నిర్మాతను కోల్పోయింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదం ఆర్.బి. చౌదరి గారి ప్రాణాలను బలి తీసుకుంది. పనుల నిమిత్తం అక్కడికి వెళ్లిన ఆయన, ఇలా ప్రమాదంలో కన్నుమూయడం అందరినీ కలిచివేస్తోంది. ఆయన మరణం కేవలం ఒక కుటుంబానికే కాదు, మొత్తం భారతీయ చిత్ర పరిశ్రమకు తీరని లోటు. చౌదరి గారి మరణవార్త తెలిసిన వెంటనే టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు ప్రేక్షకులకు 'సూపర్ గుడ్ ఫిల్మ్స్' బ్యానర్ అంటే ఒక నమ్మకం. ఈ సంస్థ నుండి సినిమా వస్తుందంటే అది ఖచ్చితంగా ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుందని పేరు. చిరంజీవి, వెంకటేష్, నాగార్జున వంటి అగ్ర హీరోలతో ఆయన ఎన్నో సినిమాలు తీశారు. ముఖ్యంగా 'సూర్యవంశం', 'రాజా', 'సుస్వాగతం', 'నువ్వు వస్తావని', 'సంక్రాంతి' వంటి క్లాసిక్ హిట్స్ అన్నీ ఈయన కలం నుండి, నిర్మాణ సారథ్యం నుండి వచ్చినవే. ఆర్.బి. చౌదరి గారి పూర్తి పేరు రతన్లాల్ భగత్రామ్ చౌదరి. ఆయన ప్రస్థానం మలయాళ సినిమాలతో మొదలైంది. 1989లో తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 'సూపర్' అనే బ్యానర్ మీద సినిమాలు తీశారు. ఆ తర్వాత అప్పట్లో ప్రసిద్ధి చెందిన 'గుడ్ నైట్' బ్రాండ్ నుండి 'గుడ్' అనే పదాన్ని కలిపి, తన నిర్మాణ సంస్థకు 'సూపర్ గుడ్ ఫిల్మ్స్' అని పేరు పెట్టారు. అప్పటి నుండి ఆయన వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఆర్.బి. చౌదరి గారికి నలుగురు కుమారులు. అందులో తమిళ స్టార్ హీరో జీవా ఒకరు. తన కుమారులను ఇండస్ట్రీలో నిలబెట్టడమే కాకుండా, ఎందరో కొత్త దర్శకులను, నటీనటులను ఆయన వెండితెరకు పరిచయం చేశారు. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా, సినిమా మీద మక్కువతో ఆయన సినిమాలు తీసేవారని ఇండస్ట్రీలో అందరూ చెప్పుకుంటారు. ఫిలింఫేర్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు ఆయనను వరించాయి. తెలుగు ఇండస్ట్రీలో ఒకప్పుడు వరుస విజయాలతో 'గోల్డెన్ హ్యాండ్' గా పేరు తెచ్చుకున్న ఆర్.బి. చౌదరి ఇక లేరనే వార్తను ఎవరూ నమ్మలేకపోతున్నారు.

# మళ్ళీ పఠాన్ వైబ్స్



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ - దీపికా పదుకొణే కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగుతుంది. ఓం శాంతి ఓం నుంచి పఠాన్ వరకు వెండితెరపై మ్యాజిక్ చేస్తూనే ఉన్నారు. తాజాగా హిట్ జోడీ కింగ్ కోసం జతకట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. ఈ నేపథ్యంలో సినిమా సెట్స్ నుండి ఒక రొమాంటిక్ సాంగ్ షూటింగ్‌కు సంబంధించిన వీడియో లీక్ కావడంతో సోషల్ మీడియాలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. లీకైన వీడియోలో షారుఖ్ ఖాన్, దీపికా పదుకొనే అందమైన లొకేషన్‌లో రొమాంటిక్ స్టెప్పులు వేస్తూ కనిపించారు. విజువల్స్ చూస్తుంటే అభిమానులకు ఫేవరెట్ జోడీ గత చిత్రం పఠాన్లోని వైబ్స్ గుర్తుకొస్తున్నాయి. వారిద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీ, ఆ గ్రేస్ చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. సాధారణంగా భారీ చిత్రాల షూటింగ్ సమయంలో ఇలాంటి వీడియోలు లీక్ అవ్వడం చిత్ర యూనిట్‌ను కలవరపెడుతుంటుంది. అయితే, అభిమానులకు మాత్రం ఇది ఓ తీపి కబురులా మారింది. సోషల్ మీడియా వేదికగా ఈ వీడియోను షేర్ చేస్తూ బాద్‌షా మళ్ళీ తన క్వీన్‌తో తిరిగి వచ్చాడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వీరిద్దరి కలయికలో పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలిచిన సందర్భాలెన్నో.

# 'విశ్వంభర' నుంచి కీరవాణి ఔట్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా, 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో చిరంజీవి సరసన త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, యంగ్ బ్యూటీ ఆషికా రంగనాథ్ ఒక కీలక పాత్రలో మెరవనుంది. అయితే, ఈ సినిమా నిర్మాణ దశ నుంచి విడుదల తేదీ వరకు వరుస మార్పులు జరుగుతుండటం ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఈ చిత్రాన్ని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ భావించారు. కానీ భారీ విజువల్ ఎఫెక్ట్స్ (ఎఫ్‌ఖ) పనులు ఉండటంతో సినిమా వాయిదా పడింది. ఆ తర్వాత సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేసినప్పటికీ, అది కూడా సాధ్యపడలేదు.

# మళ్లీ ప్రేమలో తమన్నా?

స్టార్ హీరోయిన్, మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మరోసారి తన పర్సనల్ లైఫ్ పై చేసిన కామెంట్స్ తో వార్తల్లో నిలిచారు. ప్రేమ, పెళ్లి, రిలేషన్ షిప్ పై ఆమె అభిప్రాయం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. సాధారణంగా ప్రేమలో ఒకసారి ఫెయిల్ అయితే మళ్లీ ఆ దారిలో వెళ్లడానికి చాలా మంది వెనుకంజ వేస్తారు. అయితే తమన్నా మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారనే చెప్పాలి. జీవితంలో ప్రేమ అనేది ఒక్క వ్యక్తితో మాత్రమే పరిమితం కావాల్సిన అవసరం లేదని ఆమె క్లారిటీ ఇచ్చారు. మనసుకు నచ్చిన వ్యక్తి దొరికే వరకు కొత్త రిలేషన్ ను వెతుక్కోవడం సహజమేనని చెప్పడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్నా మాట్లాడుతూ.. జీవితంలో ఎన్ని సార్లైనా ప్రేమలో పడే అవకాశం ఉంటుందని, ప్రేమను ఒకే వ్యక్తికి కట్టిపడేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ముఖ్యంగా సంబంధాలు మన ఫ్రీడమ్ కు బ్రేక్ వేసేవిగా కాకుండా, మన డెవలప్మెంట్ కు హెల్ప్ చేసేలా ఉండాలని పేర్కొన్నారు. ఆ కామెంట్స్ ఆమె పర్సనాలిటీని రిఫ్లెక్ట్ చేయడమే కాకుండా, మోడ్రన్ రిలేషన్ పై ఆమె ఆలోచనా విధానాన్ని క్లియర్‌గా తెలియజేస్తున్నాయి. కొంతకాలంపాటు విజయ్ వర్మతో తమన్నా ప్రేమలో మునిగితేలగా, అనంతరం బ్రేకప్ చెప్పుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత తమన్నా పూర్తిగా తన కెరీర్ పై దృష్టి సారించారు.



# సల్మాన్‌తో కరీనా రొమాన్స్!



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత వేగంగా సినిమాలు చేస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నారు. టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లితో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కించిన ఆయన, మరో క్రేజీ కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. 'ది ఫ్యామిలీ మ్యాన్, ఫర్జీ వంటి వెబ్ సిరీస్‌లతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ డైరెక్టర్స్ రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో సల్మాన్ ఒక సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా గురించి వినిపిస్తున్న విశేషాలు సినీ వర్గాల్లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. హాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం 'హ్యాంకాక్' తరహాలో ఈ సినిమా ఉండబోతోందట.

# రాహుల్ గాంధీతో పెళ్లా?: కంగనా



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ మీడియాలో నిత్యం హాట్ టాపికే. ఏదో అంశం విషయంలో ఆమె పేరు వినిపిస్తూనే ఉంటుంది. తాజాగా తన వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో జరుగుతోన్న ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని వివాహం చేసుకోవడానికి కంగనా అంగీకరించిందంటూ కొన్ని రోజులుగా నెట్టింట పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇంతకాలం ఈ ప్రచారాన్ని లైట్ తీసుకున్న కంగన ఇక సైలెంట్ గా లాభం లేదనుకున్న అమ్మడు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసారు. అసత్య వార్తలను వ్యాప్తి చేసే వారికి కనీసం సిగ్గు ఉండాలి అంటూ ఘాటుగా మండిపడ్డారు. తన పేరును ఉపయోగించి ఇలాంటి వార్తలను పుట్టించడం నీచమైన చర్య గా అభివర్ణించారు. ఏమాత్రం వాస్తవం లేని ఇలాంటి విషయాలను ప్రజలు నమ్మవద్దు అన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హైకోర్టులో ఆషురెడ్డికి ఊరట



తెలుగు బిగ్‌బాస్ సీజన్-3 ఫేమ్, నటి ఆషురెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆమెకు వ్యతిరేకంగా, పరువుకు భంగం కలిగించేలా ఉన్న వార్తలను, కథనాలను ప్రచురించడాన్ని తక్షణమే నిలిపివేయాలని సుమారు 30కి పైగా మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఆదేశిస్తూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 20న నమోదైన ఒక ఎఫ్ఐఆర్‌తో ఆషురెడ్డి పేరును ముడిపెడుతూ పలు మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో వరుస కథనాలు వచ్చాయి. ఇవి తనను అత్యంత ప్రతికూలంగా చిత్రీకరిస్తున్నాయని, తన ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని పేర్కొంటూ ఆషురెడ్డి పరువునష్టం దావా వేశారు. ఈ వ్యవహారంలో ఆయా మీడియా సంస్థలపై తక్షణ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు నిరాకరించింది. దీంతో ఆమె తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పి. శామ్ కోశీ ధర్మాసనం.. నటిపై వస్తున్న పరువునష్టం కలిగించే కంటెంట్‌ను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. కింది కోర్టులో ఉన్న ఆమె ఇంజంక్షన్ పిటిషన్‌పై ఆ న్యాయస్థానం తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉంటాయని హైకోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.




# ఢిల్లీ కోటపై
# చెన్నై దండయాత్ర

**చెలరేగిన సంజు శాంసన్, కార్తిక్.. ఐదో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో చెన్నై**

**ప్లే ఆఫ్స్ రేసు ఉత్కంఠ రేపుతుండగా చెన్నై సూపర్ కింగ్స్ కీలక విజయంతో రేసులోకొచ్చింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన సీఎస్కే అలవోకగా ఢిల్లీ క్యాపిటల్స్‌ను మట్టికరిపించింది. 156 పరుగులు ఛేదనలో సంజూ శాంసన్(87 నాటౌట్) అర్ధ శతకంతో విరుచుకుపడగా.. కార్తిక్ శర్మ(41 నాటౌట్) మెరుపులతో జయభేరి మోగించింది.**

ఐదో విజయంతో నాకౌట్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది చెన్నై. దాంతో, సొంతగడ్డపై గెలిచి పది పాయింట్లు సాధించాలనుకున్న ఢిల్లీకి చుక్కెదురైంది. ఐపీఎల్ -19 లీగ్ దశలో ఆలస్యంగా పుంజుకున్న చెన్నై సూపర్ కింగ్స్ మరో విజయం నమోదు చేసింది. మంగళవారం అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తుగా ఓడించింది.



**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 9 | 6 | 2 | 13 |
| బెంగళూరు | 9 | 6 | 3 | 12 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 12 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 12 |
| చెన్నై | 10 | 5 | 5 | 10 |
| ఢిల్లీ | 10 | 4 | 6 | 8 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 7 |
| ముంబై | 10 | 3 | 7 | 6 |
| లక్నో | 9 | 2 | 7 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు

తొలుత బౌలర్ల కృషితో ఆతిథ్య జట్టును పరిమితం చేసిన సీఎస్కే.. ఛేదనలో త్వరగానే రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వలేదు. శాంసన్(87 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీకి, కార్తిక్ శర్మ(41 నాటౌట్) సహకారం తోడవ్వగా వికెట్ల తేడాతో సీఎస్కే గెలుపొందింది.

ఛేదనలో ఫామ్‌లో ఉన్న రుతురాజ్ గైక్వాడ్(6)ను ఎంగిడి ఔట్ చేసి షాకిచ్చినా.. ఉర్విల్ పటేల్(17) రెండు సిక్సర్లతో ప్రమాదకరంగా కనిపించాడు. కానీ, అతడిని అక్షర్ వెనక్కి పంపగా సంజూ శాంసన్(87), కార్తిక్ శర్మ(41 నాటౌట్)లు నింపాదిగా ఆడుతూ.. పదో ఓవర్ నుంచి గేర్ మార్చారు. కుల్దీప్ వేసిన 12వ ఓవర్లో 6, 6, 4 బాదిన సంజూ 32 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. అనంతరం స్టార్క్‌ను ఉతికేస్తూ రెండు ఫోర్లు కొట్టడంతో చెన్నై స్కోర్ వంద దాటింది. హాఫ్ సెంచరీ తర్వాత మరింత రెచ్చిపోయిన సంజూ .. నటరాజన్ ఓవర్లో వరుసగా 6, 6, 4 తో విజయాన్ని మరింత తేలిక చేశాడు. 18వ ఓవర్లో కార్తిక్ వరసగా సిక్స్, ఫోర్ కొట్టడంతో చెన్నై 8 వికెట్ల తేడాతో ఢిల్లీని ఓడించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు మరోసారి తడబడ్డారు. ఆర్సీబీపై 75 పరుగులకే ఆలౌట్ నుంచి పాఠాలు నేర్వకపోవడం ఆ జట్టును ఆదిలోనే కష్టాల్లో పడేసింది. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 69కే ఐదు వికెట్లు పడిన వేళ ఇంప్యాక్ట్ సబ్ సమీర్ రిజ్వీ(40 నాటౌట్), స్టబ్స్(38) ఆదుకున్నారు. ఆఖర్లో అశుతోష్ శర్మ(14) రెండు సిక్సర్లతో స్కోర్ దాటించాడు. చివరి బంతికి రిజ్వీ సిక్సర్ బాదగా ఢిల్లీ ప్రత్యర్థికి 156 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.




## బీసీసీఐ గుప్పిట్లో ఐసీసీ: సైమన్ హార్మర్

సౌతాఫ్రికా వెటరన్ ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌ను నియంత్రిస్తుందని ఆరోపించాడు. భారత్ వాణిజ్య శక్తి కారణంగా అంతర్జాతీయ క్రికెట్‌పై భారీ ప్రభావం చూపుతోందని అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో శక్తి సమతౌల్యం ఇంకా మారలేదని వ్యాఖ్యానించాడు. తాజాగా ఇంగ్లండ్‌లోని ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సైమన్ చేసిన ఈ వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గతేడాది లార్డ్స్ వేదికగా జరిగిన ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో సౌతాఫ్రికా ఆస్ట్రేలియాను ఓడించి టెస్ట్ ఛాంపియన్‌గా అవతరించింది. 1991-92లో క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన తర్వాత వారికి ఇది తొలి రెడ్‌బాల్ టైటిల్. అయితే ఈ విజయం తర్వాత కూడా ప్రపంచ క్రికెట్‌లో శక్తి సమతౌల్యత మారలేదన్నది సైమన్ అభిప్రాయం. ఐసీసీపై ఇంకా భారత్ పెత్తనమే కొనసాగుతుందన్నది అతని వాదన. బీసీసీఐ ధనబలంతో ఐసీసీని నియంత్రిస్తోందన్నది అతని వాదన. ఇదే సందర్భంగా సైమన్ తన సొంత జట్టు సభ్యులపై ప్రశంసల వర్షం కురిపించాడు. కోచ్ షుక్రి కాన్రాడ్, కెప్టెన్ టెంబా బవుమాను ఆకాశానికెత్తాడు. వారి జట్టు ఒకరిద్దరి స్టార్ ప్లేయర్ల జట్టు కాదని.. కోచ్ ప్రతి విషయాన్ని నేరుగా మాట్లాడటం చాలా నచ్చిందని చెప్పుకొచ్చాడు. సైమన్ ఇంగ్లండ్ క్రికెట్ వ్యవస్థపై కూడా విమర్శలు గుప్పించాడు. ఇంగ్లండ్ జాతీయ జట్టులో స్పిన్నర్లకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆరోపించాడు. కౌంటీ క్రికెట్ నిర్మాణం వల్ల వారు లీడర్‌షిప్ పాత్రలో ఎదగలేకపోతున్నారని అభిప్రాయపడ్డాడు.

## సబలెంకా వార్నింగ్!

మహిళల ప్రపంచ నంబర్‌వన్, స్టార్ క్రీడాకారిణి అరీనా సబలెంకా బెదిరింపులకు దిగింది. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో తమకు ఎక్కువ మొత్తంలో షేర్ ఇవ్వకపోతే ఆ టోర్నీలను ఆటగాళ్లు బాయ్‌కాట్ చేయాలని పిలుపునిచ్చింది. ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ప్రైజ్‌మనీ విషయంలో ఇటలీ స్టార్ జానిక్ సిన్నర్.. 'ప్రైజ్‌మనీ విషయంలో పూర్తి నిరాశతో ఉన్నా' అంటూ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సిన్నర్‌కు సబలెంకా మద్దతుగా నిలుస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఆటగాళ్లకు ఆదాయంలో వాటా పెరగకపోతే మేము గ్రాండ్‌స్లామ్ టోర్నీలను బహిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆటగాళ్లు అందుకున్న షేర్‌కు, చూపెడుతున్న లెక్కలకు సంబంధం ఉండడం లేదు. అందుకే ఆటగాళ్లకు పక్కగా ఆదాయంలో ఎక్కువ వాటాను ఇవ్వాలి. ఒకవేళ మేము బహిష్కరిస్తే టోర్నీలు జరగకపోవచ్చు. అదే జరిగితే మా నుంచి వచ్చే ఎంటర్‌టైన్‌మెంట్‌ను ప్రేక్షకులు మిస్ అవుతారు. కనీసం మాతో చర్చలు జరిపి ఆటగాళ్లు సంతోషపడే విధంగా ఆదాయంలో వాటా విషయమై ఒక ముగింపు ఇస్తారని ఆశిస్తున్నా' అని చెప్పుకొచ్చింది. ఇక ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఓపెన్ ప్రైజ్‌మనీపై అగ్రశ్రేణి ఆటగాళ్లు జానిక్ సిన్నర్, కోకో గాఫ్, స్వియాటెక్, జొకోవిచ్, జ్వెరెవ్, మెద్వెదెవ్ సహా పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం ప్రైజ్‌మనీ సుమారు పది శాతం మేర పెరిగి 61.7 యూరో మిలియన్లకు చేరుకుందని ఫ్రెంచ్ ఓపెన్ నిర్వాహకులు ప్రకటించారు. అయితే ఆటగాళ్లు మాత్రం ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆటగాళ్లకు ఆదాయంలో అందించే వాటా 15.5 నుంచి 14.9 శాతానికి తగ్గిందని విమర్శిస్తున్నారు. ఇక ఈ సీజన్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ అయిన ఫ్రెంచ్ ఓపెన్ మే 18 నుంచి జూన్ 7 వరకు జరగనుంది.




## బుమ్రాపై అధిక పనిభారం: రవిశాస్త్రి

ఐపీఎల్-2026లో టీమిండియా పేస్ గుర్రం, ముంబై ఇండియన్స్ స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పేలవ ఫామ్ కొనసాగుతోంది. సోమవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ బుమ్రా విఫలమయ్యాడు. తన శైలికి విరుద్ధంగా భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. జస్ప్రీత్ తన నాలుగు ఓవర్ల కోటాలో 11.20 ఏకానమీ రేటుతో ఏకంగా 45 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ సీనియర్ పేసర్ కనీసం ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయాడు. ఈ ఏడాది సీజన్‌లో బుమ్రా మొత్తంగా కేవలం మూడు వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ప్రతీ సీజన్‌లో పర్పుల్ క్యాప్ రేసులో ఉండే బుమ్రా.. ఈసారి ఇలాంటి ప్రదర్శన చేయడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చానీయాంశమైంది. ఈ నేపథ్యలో టీమిండియా మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిరంతరాయంగా మ్యాచ్‌లు ఆడటం వల్ల బుమ్రాపై వర్క్‌లోడ్ పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. అధిక పనిభారం వల్లే బుమ్రా రాణించలేకపోతున్నాడని శాస్త్రి చెప్పుకొచ్చారు. "బుమ్రా గత 12 నెలలుగా అవిరామంగా క్రికెట్ ఆడుతున్నాడు. ఈ భారీ వర్క్‌లోడ్‌తో అతడు ఐపీఎల్‌లో అడుగుపెట్టాడు. అతడు శారీరకంగా, మానసికంగా అలిసిపోయినట్లు కన్పిస్తున్నాడు. అతడు పేలవ ప్రదర్శనకు ఇది ప్రధాన కారణం. ముంబై ఇండియన్స్ బుమ్రా పట్ల జాగ్రత్త వహించాలి. రాబోయే రెండు ఏళ్లలో భారత జట్టు బిజీ షెడ్యూల్‌తో గడపనుంది. పలు టెస్టు సిరీస్‌లు, అలాగే వన్డే ప్రపంచ కప్ వంటి కీలక టోర్నమెంట్లు జరగనున్నాయి. బుమ్రా భారత జట్టుకు చాలా కీలకం కాబట్టి, ముంబై మేనేజ్‌మెంట్ అతడిని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి అని" ఛాంపియన్స్ వాలీ కామెంటరీ కార్యక్రమంలో రవిశాస్త్రి పేర్కొన్నారు.




# టీ20ల్లో నం1. భారత్

**ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానం**

అంతర్జాతీయ క్రికెట్‌లో పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. మంగళవారం ఐసీసీ విడుదల చేసిన వార్షిక టీ20 పురుషుల జట్ల ర్యాంకింగ్స్‌లో భారత్ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు 275 రేటింగ్ పాయింట్లతో నంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. గతంతో పోలిస్తే పాయింట్ల ఆధిక్యం కాస్త తగ్గినప్పటికీ, రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ (262) కంటే భారత్ స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. ఆస్ట్రేలియా జట్టు 258 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. మే 2025 తర్వాత ఆడిన మ్యాచ్‌లకు 100 శాతం, గత రెండేళ్ల మ్యాచ్‌లకు 50 శాతం వెయిటేజీ ఇచ్చి ఈ తాజా ర్యాంకులను ఖరారు చేశారు. 2024, 2026లో వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలవడం, ఈ కాలంలో ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ ఓడిపోకపోవడంతో భారత్ స్థానం పటిష్ఠంగా ఉంది. టాప్ 7 ర్యాంకుల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. న్యూజిలాండ్ (247), దక్షిణాఫ్రికా (244), పాకిస్థాన్ (240), వెస్టిండీస్ (233) వరుసగా 4 నుంచి 7 స్థానాల్లో ఉన్నాయి. శ్రీలంక ఆరు పాయింట్లు కోల్పోవడంతో, బంగ్లాదేశ్ ఒక పాయింట్ సాధించి 8వ స్థానానికి ఎగబాకింది. శ్రీలంక 9వ స్థానానికి పడిపోయింది. ఇక ఇతర జట్ల విషయానికొస్తే, అమెరికా ఆరు రేటింగ్ పాయింట్లు సాధించి 13వ స్థానానికి చేరింది. ఇటలీ 11 పాయింట్లు పొంది మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 23వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. మరోవైపు, మొజాంబిక్ ఏకంగా 15 స్థానాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయింది.

## హెచ్‌సీఏలో రాయుడికి కీలక పదవి

**క్రికెట్ ఆపరేషన్స్ హెడ్‌గా నియామకం**




టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు తన కెరీర్‌లో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) క్రికెట్ ఆపరేషన్స్ విభాగాధిపతిగా నియమితుడయ్యాడు. ఈ విషయాన్ని రాయుడు స్వయంగా మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించాడు. ఈ నియామకం పట్ల రాయుడు సంతోషం వ్యక్తం చేశాడు. సుప్రీంకోర్టు మానిటరింగ్ కమిటీ సభ్యుడు జస్టిస్ పి. నవీన్ రావు, హెచ్‌సీఏ కార్యదర్శి ఎం. జీవన్ రెడ్డి, అపెక్స్ కౌన్సిల్ ఈ నియామకం జరిపినట్టు అంబటి రాయుడు తెలిపాడు. "హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ హెడ్‌గా నన్ను నియమించడం చాలా సంతోషంగా ఉంది. కొన్ని విషయాలను ప్రక్షాళన చేయడానికి ఇది ఒక గొప్ప అవకాశం" అని పేర్కొన్నాడు. అయితే, అంతకంటే ముఖ్యంగా హైదరాబాద్ లోనూ, తెలంగాణ రాష్ట్రంలోనూ ఉన్న అపారమైన క్రికెట్ ప్రతిభను వెలికితీయడంపైనే తాను ఎక్కువ దృష్టి సారిస్తానని రాయుడు స్పష్టం చేశాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# మమత రాజ్యాంగ ధిక్కారం?

ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు, ప్రజల తీర్పే శిరోధార్యం. అయితే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాజా వైఖరి ఈ ప్రాథమిక సూత్రానికే సవాలు విసురుతోంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 207 స్థానాలతో స్పష్టమైన మెజారిటీ సాధించినప్పటికీ, తన పార్టీ ఓటమిని అంగీకరించడానికి మమత నిరాకరించడం, 'నేను రాజీనామా చేయను' అని భీష్మించుకోవడం ఆందోళనకరం. ఇది రాజకీయ మొండితనం మాత్రమే కాదు, రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఆమెకు ఉన్న ధిక్కార ధోరణికి నిదర్శనం. ఒక నాయకురాలు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైనప్పుడు గెలుపును ఎంత హుందాగా స్వీకరిస్తారో, ఓటమిని కూడా అంతే గౌరవంగా ఆమోదించాలి. కానీ, తన ఓటమిని కుట్రఅని, ఓట్ల దొంగతనంఅని అభివర్ణిస్తూ, రాజీనామా లేఖ ఇచ్చేందుకు రాజ్‌భవన్‌కు వెళ్లనని ప్రకటించడం ద్వారా మమత నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల కమిషన్ వంటి స్వయంప్రతిపత్తి గల సంస్థలను వాషింగ్ మెషీన్లలతో పోల్చడం, వాటి నిష్పక్షపాతాన్ని పదే పదే ప్రశ్నించడం ఆమె వ్యక్తిగత ప్రాబల్యాన్ని పెంచుకునే ప్రయత్నమే తప్ప ప్రజాస్వామ్య పరిరక్షణ కాదు. మమతా బెనర్జీ రాజకీయ ప్రయాణం విశ్లేషిస్తే, ఆమె శైలి తరచూ నియంతృత్వంగా ఉందన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. గతంలో తనను ప్రశ్నించిన సామాన్యులను, రైతులను మావోయిస్టులు అని ముద్రవేసి అరెస్టు చేయించడం, కార్టూనిస్టులపై దేశద్రోహం కేసులు పెట్టడం వంటి చర్యలు ఆమె అసహనానికి అద్దం పడతాయి. కేంద్ర ప్రభుత్వంతో నిరంతర ఘర్షణ, సమాఖ్య వ్యవస్థలోని నియమాలను పట్టించుకోకపోవడం, పరిపాలన కంటే పార్టీ ప్రయోజనాలకే పెద్దపీట వేయడం వంటి అంశాలు ఆమెను ఒక సమర్థవంతమైన ప్రజాస్వామ్యవాదిగా కంటే మొండి పాలకురాలిగా నిలబెట్టాయి. ప్రజలు తీర్పునిచ్చిన తర్వాత కూడా అధికారాన్ని వదలనని పట్టుబట్టడం వల్ల బెంగాల్‌లో రాజ్యాంగ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది. రాజ్యాంగం ప్రకారం, సభలో విశ్వాసం కోల్పోయిన ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడానికి వీలులేదు. మమత తన నైతిక విజయం వాదనను పక్కన పెట్టి, ప్రజా తీర్పును గౌరవించాలి. లేనిపక్షంలో, చరిత్ర ఆమెను ప్రజాస్వామ్య పోరాట యోధురాలిగా కంటే, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాసిన నియంతగానే గుర్తుంచుకుంటుంది.



## ముంచుకొస్తున్న ముప్పు!

దేశవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగడానికి గ్లోబల్ వార్మింగ్, ఎల్-నినో ప్రభావం ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది 'సూపర్ ఎల్-నినో' కూడా ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ 'సూపర్ ఎల్-నినో' ప్రభావం మన ఆర్థిక వ్యవస్థను, దైనందిన జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీయనుంది.

ఎల్-నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే ఒక అసాధారణ వాతావరణ ప్రక్రియ. సాధారణంగా భూమధ్యరేఖ వెంబడి వీచే 'ట్రేడ్ విండ్స్' వేడి నీటిని ఆసియా వైపునకు నెడతాయి. అయితే, ఎల్-నినో సమయంలో ఈ గాలులు బలహీనపడటంతో, ఆ వేడి నీరు వెనక్కి అమెరికా తీరం వైపునకు ప్రవహిస్తుంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిని, ఒకచోట అతివృష్టి, మరోచోట తీవ్రమైన కరవు పరిస్థితులు ఏర్పడతాయి.

**1877 తర్వాత మళ్లీ..**

వాతావరణ పరిశోధకుల అంచనా ప్రకారం, 2026లో రాబోయే ఎల్-నినో గత 140 ఏళ్ల చరిత్రలోనే అత్యంత శక్తివంతమైనదిగా మారబోతోంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుతుండటంతో దీనిని 'సూపర్ ఎల్-నినో' అని పిలుస్తున్నారు. ఇది 1877లో భారతదేశాన్ని అతలాకుతలం చేసిన భయంకరమైన కరవు కాలాన్ని గుర్తుకు తెస్తోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది రైతులు వర్షాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తారు. సరైన వర్షపాతం లేకపోవడం వల్ల పంట దిగుబడులు తగ్గి, అన్నదాతలు భారీ నష్టాలను చవిచూసే ప్రమాదం ఉంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోవడంతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి, సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతుంది. వేసవిలో గాలిలో తేమ శాతం తగ్గి, పొడిగాలులు వీయడం వల్ల భూమి వేగంగా వేడెక్కుతోంది. అలాగే కాంక్రీట్ భవనాలు, చెట్ల నరికివేత, వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే పొగ కారణంగా పట్టణాల్లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదవుతున్నాయి. వాయువ్య భారతదేశం నుంచి వీస్తున్న వేడి, పొడిగాలులు ఇతర ప్రాంతాలకు వ్యాపించడం వల్ల ఉష్ణోగ్రతలు 45-46 డిగ్రీల వరకు చేరుతున్నాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనవసరంగా బయటకు రావద్దు. తగినంత నీరు తీసుకోవడం, ఎలక్ట్రోలైట్స్, ఓఆర్ఎస్ ద్రావణాలను తాగడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. పచ్చదనాన్ని కాపాడుకోవడంతో పాటు కొత్త మొక్కలు నాటి కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తేనే దీర్ఘకాలికంగా ఇలాంటి విపత్తులను అడ్డుకోవచ్చు.



ముత్యాల సురేశ్,
సీనియర్ జర్నలిస్ట్, 9912715325

## కొత్త ప్రయోగాలు.. ప్రజాకాంక్షలు

భారతీయ ప్రజాస్వామ్యంలో రాజకీయ స్థిరత్వం అనేది ఒక నిరంతర ప్రవాహం వంటిది. ముఖ్యంగా తెలంగాణ వంటి చైతన్యవంతమైన రాష్ట్రంలో రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. గత పదేళ్ల పాలన తర్వాత వచ్చిన అధికార మార్పిడి, ఇప్పుడు సరికొత్త రాజకీయ ప్రయోగాలకు వేదికవుతోంది. ఇతర రాష్ట్రాల్లో చిన్న పార్టీలు సృష్టించిన సంచలనాలు, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనూ కొత్త ఆశలకు, ఆలోచనలకు బీజం వేస్తున్నాయి.



వెంకటేశ్ గుగ్గిళ్ల
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారిన తర్వాత, తెలంగాణ సెంటిమెంట్‌కు కొంత దూరమైందనే భావన ప్రజల్లో కలిగింది. దీన్ని పునరుద్ధరించడానికి మళ్లీ ఒక స్వచ్ఛమైన తెలంగాణ ప్రాంతీయ పార్టీ అవసరమని కొందరు భావిస్తున్నారు. తెలంగాణలో మహిళా ఓటర్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. మహిళా సాధికారత, తెలంగాణ సంస్కృతి (బతుకమ్మ వంటివి) ప్రతిబింబించేలా ఒక కొత్త గళం వినిపిస్తే అది రాజకీయంగా లాభిస్తుందనేది ఒక విశ్లేషణ. కాంగ్రెస్, బీజేపీల మధ్య జరుగుతున్న పోరులో మూడో ప్రత్యామ్నాయంగా, కేవలం రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా సాగే కొత్త వేదికగా తెలంగాణ రక్షణ సేన నిలవబోతోందా? అన్నది వేచి చూడాలి. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో జనసేన సాధించిన విజయం లేదా పంజాబ్, ఢిల్లీలలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయోగాలు తెలంగాణ నేతలకు ఒక పాఠంగా మారాయి. క్షేత్రస్థాయిలో బలం లేకపోయినా, సరైన వ్యూహం, పొత్తులతో అధికారాన్ని ఎలా ప్రభావితం చేయవచ్చో పవన్ కళ్యాణ్ నిరూపించారు. ఇది తెలంగాణలోని యువ నేతల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కొత్త పార్టీ ఎందుకు వస్తోంది? అది పాత పార్టీకి బీ-టీమ్ లాగా పనిచేస్తుందా? లేక నిజంగానే ప్రజల కోసమా? అనే అనుమానాలను పటాపంచలు చేయాలి. కేవలం నాయకులు ఉంటే సరిపోదు, గ్రామీణ స్థాయిలో బలమైన కార్యకర్తల సేన ఉండాలి నేటి ఎన్నికల రాజకీయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇలాంటి సందర్భంలో కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీని ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా, అటు సొంత కుటుంబ నేతృత్వంలోని బీఆర్ఎస్‌కు భిన్నంగా తనకంటూ ఒక ప్రత్యేక గళాన్ని ఆమె వినిపిస్తున్నారు. సంపూర్ణ తెలంగాణ వికాసం, అమరవీరుల ఆశయాల సాధన కోసమే ఈ పార్టీ అని ఆమె పేర్కొన్నారు. తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయ విజయం, పశ్చిమ బెంగాల్‌లో మారిన సమీకరణాలు ప్రాంతీయ శక్తులకు కొత్త ఊపిరినిస్తున్నాయి. అయితే, జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల ఆధిపత్యానికి గండికొట్టేలా ప్రాంతీయ ప్రయోజనాలే పరమావధిగా పనిచేసే చిన్న పార్టీల వైపు ప్రజలు మొగ్గు చూపుతారా అనేది ఇప్పుడు చర్చనీయాంశం.



## దెబ్బకొట్టిన హిందూ వ్యతిరేకత

పశ్చిమ బెంగాల్ రాజకీయ యవనికపై ఒక చారిత్రక మార్పు ఆవిష్కృతమైంది. దశాబ్దాల తరబడి సాగిన ప్రాంతీయ పార్టీల ఆధిపత్యానికి గండికొడుతూ, భారతీయ జనతా పార్టీ సాధించిన అఖండ విజయం భారత రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. బెంగాల్ వంటి అతిపెద్ద, రాజకీయ చైతన్యం ఉన్న రాష్ట్రంలో బీజేపీ జైత్రయాత్ర కేవలం ఒక పార్టీ గెలుపు మాత్రమే కాదు, అది ఒక సిద్ధాంతపరమైన మార్పుకు సంకేతం. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఓటమికి ప్రధాన కారణాలను విశ్లేషిస్తే, ఆ పార్టీ అనుసరించిన హిందూ వ్యతిరేక ధోరణి, బుజ్జగింపు రాజకీయాలే వారిని పతనం వైపు నడిపించాయని స్పష్టమవుతోంది. అధికారం కోసం ఒక వర్గాన్ని ప్రసన్నం చేసుకునే క్రమంలో, మెజారిటీ హిందూ సమాజ సెంటిమెంట్లను, సంస్కృతిని విస్మరించడం టీఎంసీ చేసిన అతిపెద్ద తప్పు. దుర్గాపూజ వంటి పవిత్ర పండుగల విషయంలో ఆంక్షలు విధించడం, జై శ్రీరామ్ నినాదం పట్ల అసహనం ప్రదర్శించడం బెంగాలీ ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. 'భద్రలోక్' సంస్కృతి పేరుతో హిందూ అస్తిత్వాన్ని అణచివేయాలని చూసిన ప్రయత్నాలను ప్రజలు తమ ఓటు ద్వారా తిప్పికొట్టారు. మరోవైపు, బీజేపీ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని తన గెలుపు బాటలను సుగమం చేసుకుంది. బెంగాల్ గడ్డపై తన జాతీయవాద భావజాలాన్ని బలంగా వినిపించడంలో కమలం పార్టీ విజయం సాధించింది. హిందూ ఓట్ల ధ్రువీకరణ జరగడమే కాకుండా, టీఎంసీ పాలనలో కొనసాగిన హింస, అవినీతి, సిండికేట్ రాజ్ పట్ల విసిగిపోయిన సామాన్య ప్రజానీకం మార్పును కోరుకున్నారు. కేంద్ర నాయకత్వం యొక్క పటిష్ట వ్యూహాలు, స్థానిక సమస్యలపై పోరాటం బీజేపీని అధికార పీఠం వైపు నడిపించాయి. బెంగాల్ విజయం దేశ చరిత్రలో ఎందుకు కీలకమంటే.. ఇది కేవలం ఒక రాష్ట్ర ఎన్నికల ఫలితం కాదు. తూర్పు భారతదేశంలో జాతీయవాద శక్తుల బలానికి ఇది నిదర్శనం. ప్రాంతీయ భావోద్వేగాల కంటే జాతీయ ప్రయోజనాలే మిన్న అని బెంగాల్ తీర్పు చాటిచెప్పింది. ఈ గెలుపు రాబోయే రోజుల్లో ఇతర రాష్ట్రాల రాజకీయాలపై కూడా తీవ్ర ప్రభావం చూపబోతోంది. సనాతన ధర్మాన్ని, హిందూ అస్తిత్వాన్ని విస్మరించే ఏ పార్టీకైనా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారనే సందేశాన్ని బెంగాల్ బలంగా పంపింది. మొత్తానికి, బెంగాల్‌లో వికసించిన కమలం దేశ రాజకీయాల్లో ఒక నవ శకాన్ని ప్రారంభించింది. ఇది భవిష్యత్తులో జాతీయ రాజకీయాల గమనాన్ని మార్చబోయే ఒక పెద్ద మలుపు.



అభిషేక్ కురుమ
విశ్వహిందూ పరిషత్తు

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.